www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

మంగళవారం | 06 | జనవరి | 2026 పేజీలు : 8






## శతాబ్ది సమర సంబురం..

# జిల్లా ఉద్యమ ఘట్టాలు

జనవరి 18న జరగనున్న ఒక మహోజ్వల ఘట్టానికి ఖమ్మం వేదిక కానుంది. వందేళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో సిపిఐ సాధించిన విజయాలు, భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ నేటి తరాన్ని కార్యోన్ముఖులను చేసే ప్రక్రియలో భాగంగా జనవరి 18న సిపిఐ శతాబ్ది ఉత్సవ ముగింపు సభలను ఖమ్మంలో నిర్వహించనున్నారు. వందేళ్ల ప్రస్థానంలో రైతులు, గ్రామీణ పేదలు, కార్మికులు, ఉద్యోగులు, మహిళలు , విద్యార్థుల ప్రయోజనాల సంరక్షణకు హక్కుల కోసం నిర్వీరామంగా పోరాడిన సిపిఐకి ప్రజల పక్షం తప్ప మరో ధ్యాస లేదు. ప్రజల ప్రయోజనాలకు విఘాతం కలిగిన ప్రతిసారి ప్రజల పక్షాన నిలబడి పోరాడింది. బాధితులకు అండగా నిలిచింది. ఉదార వాద ఆర్థిక విధానాలకు ఎదురొడ్డి నిలబడింది. సామ్రాజ్యవాద విష సంస్కృతిని అడ్డుకుంటూ ఇందుకు మూలమైన పెట్టుబడిదారి విధానాన్ని బహిర్గతం చేస్తూ రాజీలేని పోరాటం సాగిస్తుంది. ఈ పోరాట క్రమంలో ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు పార్టీ అనేక ఉద్యమాలకు పురుడుపోసింది. అందుకే ఖమ్మంను విప్లవాల గుమ్మం అంటారు. ఎందరో యోధుల త్యాగాలతో ఈ నేల పునీతమైంది. స్వాతంత్ర్యానికి ముందే ఇక్కడ కమ్యూనిస్టు ఆలోచనలు కలిగిన అనేక మంది అభ్యుదయ వాదులు కలిసి పనిచేశారు. 1953 అక్టోబర్ 19న వరంగల్ జిల్లా నుంచి విడివడిన తర్వాత ఖమ్మం జిల్లా విభిన్న సంస్కృతులకు సమ్మేళనంగా ఉండేది. ఇక్కడ అటవీ ప్రాంతంతో పాటు గిరిజన జనాభా కూడా ఎక్కువే. అదే సమయంలో కొందరు ఖమ్మం జిల్లాను ఆంధ్రా, తెలంగాణల వారధి అంటుంటారు. భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం సాగిన ఉద్యమంలో ఖమ్మం జిల్లా ముందు వరుసలో నిలిచింది. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు లాంటి ఉద్యమాలు ఉద్భవించినప్పుడు సహేతుకమైన డిమాండ్లకు అనుగుణంగా స్పందించింది. అప్పటి శాసనసభ్యుడు, సిపిఐ నాయకుడు నల్లమల గిరిప్రసాద్ విశాఖ ఉక్కు ఉద్యమం సందర్భంగా రాజీనామా చేశారు. వీరమాచినేని ప్రసాద్, నల్లమల గిరిప్రసాద్, యరమనేని వెంకటనర్సయ్య, పారుపల్లి పుల్లయ్య, చుండూరి నర్సింహారావు, కొణిదెన సీతారామయ్య తదితరులు పాల్వంచ జోనల్ కమిటీ సభ్యులుగా పనిచేశారు. సాయుధ దళాలతో యూనియన్ సైన్యాలకు వ్యతిరేకంగా పోరాడారు. అటవీ ప్రాంతాల నుండి సాయుధ దళాలను వేరు చేసేందుకు అడవుల నుండి గిరిజనులను తరిమివేయాలని భావించినప్పుడు కమ్యూనిస్టు పార్టీ అందుకు వ్యతిరేకంగా పోరాడింది. భద్రాచలం అటవీ ప్రాంతంలో విస్తారంగా లభ్యమయ్యే తునికాకు సేకరించే గిరిజనుల శ్రమ దోపిడీకి పాల్పడడానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ పోరాటం చేసి శ్రమకు తగిన కూలీ లభించేటట్లు చేసింది. అంతేకాకుండా ఆ రోజుల్లో అడవిలోకి పశువులు, జీవాలు మేతకు వెళితే పుల్లరి కట్టాల్సి వచ్చేది. ఇందుకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ పోరాడి పుల్లరి పన్నును రద్దు చేసింది. పేద గిరిజనులకు 2ఎ క్రింద ఉన్న భూములకు పట్టాలు ఉండేవి కావు. సిపిఐ పోరాట ఫలితంగానే 2ఎను రద్దు చేసి గిరిజనులకు హక్కులు కల్పించింది. 1964 చీలిక తర్వాత ఖమ్మం జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ నామ మాత్రంగా మిగిలింది. కా॥ గిరిప్రసాద్, మనుబోతుల కొమరయ్య, టిబి విఠల్‌రావు, రావెళ్ల జానకి రామయ్య, చుండూరి నర్సింహారావు, సర్వదేవభట్ల రామనాథం తదితరులు 1964 ఏప్రిల్ 16, 17 తేదీలలో కొక్కిరేణిలో జరిగిన సమావేశంలో పుచ్చలపల్లి సుందరయ్య రిపోర్టును వ్యతిరేకించి కమ్యూనిస్టు పార్టీలో కొనసాగాలని నిర్ణయించారు. 1972 మేడే ఉత్సవాల సందర్భంగా కా॥ రజబ్‌అలీ సహ ఖమ్మం తాలూకాలో వెయ్యి మంది సిపిఐ సభ్యులు సిపిఐలో చేరారు. 1967 నుండి 1983 వరకు సిపిఐ జిల్లా కార్యదర్శిగా పనిచేసిన పువ్వాడ నాగేశ్వరరావు, నల్లమల గిరిప్రసాద్ సహకారంతో ఖమ్మం జిల్లాలో కమ్యూనిస్టు పార్టీకి బలమైన పునాదులు వేశారు. 1981లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో పువ్వాడ నాగేశ్వరరావు శాసన మండలికి ఎన్నికై కమ్యూనిస్టు పార్టీకి ఒక ఊపును తీసుకు వచ్చారు. అదే సమయంలో కమ్యూనిస్టుల ఐక్యతతో 11 సమితుల్లో విజయం సాధించి వామపక్ష ఉద్యమానికి బలమైన పునాదులు వేశారు. 1975, 1976లో జరిగిన భూ పోరాట ఫలితంగా వేలాది మంది పేదలకు సొంత భూమి దక్కింది. 1976 అత్యవసర పరిస్థితుల్లోనూ వందలాది మందిని జైళ్లలో నిర్బంధించిన భూ పోరాటం ఆగలేదు. ఖమ్మం జిల్లాలో 12 కేంద్రాల్లో జరిగిన భూ పోరాటం కారణంగా 10వేల ఎకరాలు పేదల సొంతమయ్యాయి. 1303 మందిని అరెస్టు చేసి జైళ్లకు తరలించారంటే ఆనాటి ఉద్యమతీరు అవగతమవుతుంది. 1978లో సిపిఐ ఆధ్వర్యంలో జరిగిన సత్యాగ్రహం సందర్భంగా 5582 మందిని అరెస్టు చేశారు. ఆనాడు కలెక్టరేట్ వద్ద ప్రశాంతంగా ఆందోళన చేస్తున్న వారిపై భాష్పవాయువు ప్రయోగించి కాల్పులు జరిపారు. 123 మందిపై అతి కఠినమైన సెక్షన్ల క్రింద కేసులు నమోదు చేసి జైళ్లకు పంపించారు. 1979 ఫిబ్రవరి 27 నుంచి మార్చి ఐదు వరకు జరిగిన భూ పోరాటం ఆనాడు రాష్ట్రానికే దిక్సూచిగా నిలిచింది. 1978లో సింగరేణిలో జరిగిన సిడిఎస్ సమ్మె కారణంగా 27 లక్షల రూపాయలను సింగరేణి యాజమాన్యం విడుదల చేసింది. అది కమ్యూనిస్టు పార్టీ ఏఐటియుసి పోరాట ఫలితంగానే జరిగింది. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు జరిగాయి. 1987 జనవరి నాలుగున ఖమ్మంలో జరిగిన ప్రదర్శన అప్పట్లో ప్రజా ఉద్యమాలకు ఒక ఊపునిచ్చింది. టెర్రరిస్టు చట్టానికి వ్యతిరేకంగా 1988 అక్టోబర్ 23న కొత్తగూడెంలో జరిగిన అపూర్వ ప్రదర్శన, బహిరంగ సభ ప్రజా ఉద్యమాలకు బాసటగా నిలిచింది. ఇప్పటి కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావుపై టాడా కేసును నిరసిస్తూ కొత్తగూడెంలోని ప్రకాషం మైదానంలో నిర్వహించిన సభకు వేల మంది తరలివచ్చారు. కమ్యూనిస్టు పార్టీ అనేక ఉద్యమాలకు ప్రేరణగా నిలిచింది. బయ్యారం గనుల అక్రమ తవ్వకాలకు వ్యతిరేకంగా సిపిఐ ఇచ్చిన పిలుపు ఇటీవల ప్రజా ఉద్యమాలకు ప్రేరణగా నిలిచింది. వేలాది మందిని సమీకరించి ఖమ్మం జిల్లాకు వచ్చే 18 రహదారులను దిగ్బంధనం చేయడం ద్వారా ప్రజా ఉద్యమాలలో సిపిఐ సరికొత్త పంథాను తీసుకువచ్చింది. ఎడతెగని ఆందోళనలతో లక్షల కోట్ల రూపాయల ఐరన్‌వోర్ ఖనిజాన్ని కాపాడి సిపిఐ తనకంటూ ఒక చరిత్రను లిఖించుకుంది. 180 కిలో మీటర్ల మేర అప్పటి ఖమ్మంజిల్లాలో ప్రవహిస్తున్న గోదావరి జలాలను సద్వినియోగం చేయాలని చేపట్టిన ఆందోళనలు అనేకం. దుమ్ముగూడెం సాధన పేరుతో సిపిఐ చారిత్రిక ఉద్యమాన్ని నిర్వర్తించింది. తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలోనూ ఒక జాతీయ పార్టీగా సిపిఐ ఖమ్మం జిల్లాలో అనేక ఉద్యమాలకు, ఆందోళనలకు నేతృత్వంవహించింది. పాదయాత్రలు, అమరణ నిరాహార దీక్షలు అనేకం చేపట్టి తెలంగాణ సాధించేంత వరకు అవిశ్రాంతంగా పోరాడింది. అటువంటి పోరాట పురిటిగడ్డపై జనవరి 18న ఒక చారిత్రిక సభ జరగనుంది. వందేళ్ల పోరాట చరిత్రను , త్యాగాల పరంపరను నేటి తరానికి తెలియజేయడంతో పాటు భవిష్యత్తు ఉద్యమాలకు ప్రేరణగా నిలిచేందుకు శతాబ్ది ఉత్సవ ముగింపు సభను నిర్వహించనున్నారు. ఈ సభ సందర్భంగా ఇప్పటికే ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా గ్రామ గ్రామాన ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి శతాబ్ది సమర సభ సందేశాన్ని అందించారు. గడిచిన ఐదు రోజులుగా ఉమ్మడి జిల్లాలో రెండు జాతాలు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నాయి. ఖమ్మంజిల్లా చరిత్రలో జనవరి 18న జరిగే సభ మరో మైలురాయిగా నిలవనుంది.

-ప్రజాపక్షం/ ఖమ్మం :

# సామినేని హత్య కేసు దోషులను తేల్చండి

**-హత్య కేసుపై సిట్ వేయాలి -శాసనసభలో కూనంనేని**



ప్రజాపక్షం/ ఖమ్మం : సిపిఎం నాయకుడు సామినేని రామారావు హత్య కేసుకు సంబంధించి త్వరితగతిన దోషులను తేల్చాలని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు శాసనసభలో డిమాండ్ చేశారు. సోమవారం శాసనసభలో ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 31న సామినేని రామారావు ను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారని ఇప్పటి వరకు దోషులెవరో తేల్చలేదన్నారు. రైతు సంఘం ఉమ్మడి రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసిన సామినేని రామారావు ఏడు పదులు దాటిన వయస్సులో గ్రామంలో ప్రశాంతంగా జీవిస్తున్నారని అటువంటి వ్యక్తిని ఎవరు హత్య చేశారో తేల్చాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసులు కుటుంబ సభ్యులను లై డిటెక్టర్ పరీక్షకు సిద్ధం కావాలని అడిగినట్లు సమాచారం ఉందని ఇది సరికాదన్నారు. హత్య కేసు దర్యాప్తుకు సంబంధించి ప్రత్యేక దర్యాప్తు సంస్థను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. మధిర నియోజక వర్గంలో జరిగిన ఈ హత్య రాజకీయంగా సంచలనం సృష్టించిందని ఆయన తెలిపారు.

# రేపటి నుంచి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు





**-పోటీల్లో పాల్గొనున్న 33 రాష్ట్రాల క్రీడాకారులు**
**-హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పలువురు మంత్రులు**

ప్రజాపక్షం/పినపాక : జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఏడూళ్ళబయ్యారం అతిథ్యం మివ్వనుంది. జాతీయ కబడ్డీ పోటీలకు పినపాక మండలం ఏడూళ్ళబయ్యారం వేదికగా కానుంది. తెలంగాణ రాష్ట్రంలోని మారుమూల ఏజెన్సీ ప్రాంతంలో తొలి సారిగా దేశ వ్యాప్తంగా పేరు పొందనుంది. గతంలో ఏడూళ్ళబయ్యారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర స్థాయి అండర్ 17 బాలబాలికల కబడ్డీ పోటీలు ఘనంగా జరిగాయి. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లాల నుండి క్రీడాకారులు పాల్గొని తమ సత్తాను చాటి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. మహారాష్ట్రలో జాతీయ బాలికల కబడ్డీ పోటీలు జరుగుతుండగా జనవరి 7వ తేదీ నుండి 11వ తేదీ వరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలుర విభాగం జాతీయ కబడ్డీ పోటీలను నిర్వహించనున్నారు.

మిగతా 2లో..

# కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ కార్పొరేటర్లు



# జిల్లాలో సిపిఐ రణ నినాదం





- కొనసాగుతున్న వందేళ్ల ప్రచార జాత
- 5లక్షల మందితో ఖమ్మంలో శత వసంత ఉత్సవ ముగింపు సభ
- జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సిపిఐ శత వసంత ఉత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో రణ నినాదం కొనసాగుతోంది. జిల్లా నలుదిక్కులు పిక్కటిల్లే సిపిఐ వందేళ్ల ఉత్సాహ జోరు మిన్నంటుతోంది. ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార జాత మూడో రోజుకి చేరుకుంది. సోమవారం ఆళ్లపల్లి మండల కేంద్రంలో ప్రారంభమైన ఈ జాత, ఇల్లెందు, లక్ష్మీదేవిపల్లి మండలాల మీదుగా పాల్వంచకు చేరింది. ఈ సందర్భంగా నవభారత్ వద్ద ప్రచార జాతకు ఉత్సాహపూరిత వాతావణంలో, వందలాది మోటార్ సైకిళ్లతో, ఎర్రజండాల రెపరెపల నడుమ ఘన స్వాగతం పలికారు. నేడు అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలోని ములకలపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ మండలాల్లో సాగనుంది. జాతాను ఉద్దేశించి లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని అనిశెట్టిపల్లి, సీతారామపురం గ్రామాల్లో జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా మాట్లాడారు. జనవరి 18న ఖమ్మం నగరంలో సిపిఐ శత వసంతాల ముగింపు సభ ఐదు లక్షల గొంతుకల రణనినాదం అని, భవిష్యత్ ప్రజా పోరాటాలకు ఖమ్మం సభ ప్రేరణగా నిలవబోతోందన్నారు. ఖమ్మం బహిరంగ సభ విజయవంతం కోసం చేపట్టిన ప్రచారం జాత విజయవంతంగా కొనసాగుతోందన్నారు. వందేళ్ల కమ్యూనిస్టు చరిత్రను కేవలం ఒక జ్ఞాపకంగా కాకుండా భవిష్యత్ పోరాటాలకు పునాదిగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. సిపిఐ శతబ్ధకాల చరిత్ర,త్యాగాలు, పోరాటాలతో నిండి ఉందన్నారు. కార్మికులు, రైతులు, పేదల హక్కుల కోసం కమ్యూనిస్టు పార్టీ నిరంతరం పోరాడుతోందని చెప్పారు. దేశంలో పెరుగుతున్న అసమానతులు, ప్రజావ్యతిరేక విధానాలను నిలువరించేందుకు ఐక్య పోరాటాలు అవసరమని పిలునిచ్చారు. ఈనెల 18న జరిగే బహిరంగ సభకు భద్రాద్రి కొత్తగూడెంజిల్లా నుండి ప్రజలు దండుగా కదిలి రావాలని కోరారు. ఈ సభ కమ్యూనిస్టు ఉధ్యమానికి దిశా నిర్ధేశం చేసే చారిత్రాత్మక సభగా నిలువనుందని చెప్పారు. ఈ ప్రచార జాతాలో నాయకులు ముత్యాలవిశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, చంద్రగిరి శ్రీనివాసరావు, పహీం, ధీటి లక్ష్మీపతి, అజిత్, నునావత్ గోవింద్, జరుపుల ఉపేందర్, బీబీ, సపావట్ రవి, జలీల్‌పాషా, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# రేపటి నుంచి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు




(మొదటిపేజీ తరువాయి)

భారతదేశంలోనే మొట్ట మొదటి సారి జాతీయ కబడ్డీ పోటీలు ఏడూళ్ళ బయ్యారం వేదిక కానుండంతో క్రీడాకారులకు, క్రీడాభిమానులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు ముందస్తు ఏర్పాట్లు కసరత్తు చేశారు. 33రాష్ట్రాల నుండి క్రీడాకారులు రానుండటంతో భోజన వసతుల సౌకర్యాలకై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏడూళ్ళబయ్యారం ప్రాంతంలో జాతీయ కబడ్డీ పోటీలు జరుగనుండటం ఎంతో సంతోషంగా ఉందని పినపాక మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నేటి వరకు కబడ్డీ పోటీలు క్రీడాభిమానులు టీవీల్లోనే వీక్షించి, తొలి సారిగా ఏడూళ్ళబయ్యారంలో జరిగే జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు తిలకించేందుకు ప్రజలంతా మక్కువపెడుతున్నారు. ఈ పోటీలు ప్రారంభించేందుకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు ధనసరి సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పలువురు మంత్రులు రానున్న నేపథ్యంలో పోలీస్ శాఖ అధికారులు అప్రమత్తమవుతున్నారు. తొలిసారిగా సీఎం రేవంత్‌రెడ్డి ఏడూళ్ళబయ్యారంలో పర్యటించనుండటంతో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు పోలీస్ శాఖ చేపడుతున్నారు. నవంబర్‌లో జరిగిన రాష్ట్ర కబడ్జీ పోటీలకు విచ్చేసిన క్రీడాకారులకు, అధికారులకు, క్రీడాభిమానులకు కంది చారిటబుల్ ట్రస్ట్ ఆతిథ్యాన్ని అందించింది. జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు విచ్చేయనున్న క్రీడాకారులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా మౌరిటెక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లను చేస్తున్నారు. ఈ పోటీల ద్వారా గ్రామీణ స్థాయిలో క్రీడాకారులకు తీర్చిదిద్దేందుకు వారిలో స్ఫూర్తి నింపేందుకు ఈ కబడ్డీ పోటీలు ఎంతో ఉపయోగపడతాయని నిర్వాహకులు తెలిపారు. జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన వివిధ జిల్లాలకు చెందిన పలువురు క్రీడాకారులు ఏడూళ్ళబయ్యారంలో ప్రత్యేక శిబిరంలో శిక్షణ పొందుతున్నారు.

### జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి : కలెక్టర్

క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా వసతి, భోజనం, రవాణా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పోటీలు జరిగే మైదానాలు, గ్యాలరీలు, విద్యుత్, త్రాగునీరు, వైద్య సదుపాయాలు సిద్ధం చేయాలన్నారు. జిల్లా ప్రతిష్టకు తగిన విధంగా పోటీలు నిర్వహించేలా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

# మున్సిపాలిటీలో రాజకీయనాయకులతో సమావేశం

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తయారు చేసిన డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్‌లో ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా ఈ నెల 7లోపు తెలపాలన్నారు. కాగా ఎన్నికల నేపథ్యంలో పెద్ద సంఖ్యలో పలు పార్టీల నాయకులు, పోటిదారులు మున్సిపాలిటీకి తరలి రావడంతో కోలాహలం నెలకొంది. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్‌బాబు, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, బిఎస్‌పి నాయకుడు చెరుకుపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ కార్పొరేటర్లు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన బిఆర్ఎస్ కార్పొరేటర్లు సోమవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈనెల ఏడున కేటిఆర్ ఖమ్మం జిల్లా పర్యటన నేపథ్యంలో కార్పొరేటర్లు పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరడం చర్చనీయాంశమైంది. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ మార్పుపై చర్చ సాగుతుంది. ఖమ్మం కార్పోరేషన్‌లోని 12వ డివిజన్ కార్పొరేటర్ చిరుమామిళ్ల లక్ష్మి, 25వ డివిజన్ కార్పొరేటర్ చంద్రకళ, 55వ డివిజన్ కార్పొరేటర్ మోతారపు శ్రావణి, 40వ డివిజన్ కార్పొరేటర్ దాదె అమృతమ్మ, 32వ డివిజన్ కార్పొరేటర్ దోన్‌వాన్ సరస్వతి పార్టీలు మారిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, కాంగ్రెస్ నాయకులు బాలసాని లక్ష్మినారాయణ, నాగండ్ల దీపక్‌చౌదరి, రావురి సైదుబాబు, కమర్తపు మురళి, మోతారపు సుధాకర్, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్, సిపిలను కలిసిన ఐజెయు నాయకులు





**ప్రజాపక్షం/ ఖమ్మం :** టియుడబ్ల్యుజె (ఐజెయు) నాయకులు సోమవారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్‌లను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో పరిపాలన వ్యవహారాలు, శాంతిభద్రతలు, పంచాయతీ ఎన్నికల నిర్వహణ ప్రశాంతంగా జరగడంపై అధికారులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాం నారాయణ, జాతీయ కౌన్సిల్ సభ్యులు నలజాల వెంకట్రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణుగోపాల్, జిల్లా కార్యదర్శి మైసా పాపారావు, నాయకులు చెరుకుపల్లి శ్రీనివాస్, జనార్ధానాచారి, తాళ్లూరి మురళీకృష్ణ, సత్యనారాయణ, మాధవరావు, ఏలూరి వేణుగోపాలరావు, కళ్యాణ్, గోపాల్, గోసుల నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు. అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, అడిషనల్ సిపి రామానుజం లను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# గవర్నర్ చేతుల మీదుగా లెనిన్ శ్రీనివాస్‌కు విశిష్ట పురస్కార్



**ప్రజాపక్షం/ ఖమ్మం :** మూడవ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ఖమ్మంకు చెందిన ప్రముఖ కవి, వికాస వేదిక సాహిత్య సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్ శ్రీనివాస్‌కు త్రిపుర గవర్నర్ డా॥ ఎన్. ఇంద్రసేనారెడ్డి చేతుల మీదుగా విశిష్ట పురస్కారాన్ని అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాలో జరిగిన తెలుగు మహాసభల్లో లెనిన్ శ్రీనివాస్‌కు ఈ పురస్కారం దక్కింది. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, కర్నాటక మాజీ స్పీకర్ రమేష్‌కుమార్, మాడుగుల నాగఫణీశర్మ, గజల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. లెనిన్ శ్రీనివాస్‌ను శాలువతో సత్కరించి జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. లెనిన్ శ్రీనివాస్‌ను పలువురు సాహితివేత్తలు అభినందించారు.

# విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాన్ని పెంపొందించాలి



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాన్ని పెంపొందించాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి పెసర ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఎంఎంవో పెసర ప్రభాకర్‌రెడ్డి సోమవారం మండల పరిధిలోని పలు పాఠశాలలను సందర్శించారు. బూడిదంపాడు, సూర్యాతండా, పుతానితండా, రాంక్యాతండా పాఠశాలలను ఎఎంవో సందర్శించి పరిసరాలను పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎంవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఎవ్రీ చైల్డ్ రీడ్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని విద్యార్థుల్లో పఠనాభివృద్ధికి కృషి చేయాలన్నారు. అభ్యాసన ఫలితాల సాధన దిశగా ప్రయత్నిస్తూ నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాలైన ఉచిత దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం, పౌష్టికాహారం కోసం రాగిజావా పంపిణీ వంటి వాటిని గ్రామాల్లో ప్రజలకు వివరిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరుపాడులో పశు సంతానోత్పత్తి శిబిరం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని గూడూరుపాడులో పశు వైద్యశాఖ ఆధ్వర్యంలో పశు సంతానోత్పత్తిపై సోమవారం శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పుచ్చకాయల శ్రీదేవికమలాకర్ హాజరై రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పశు సంతానోత్పత్తి వలన కలిగే లాభాలను వెటర్నరీ డాక్టర్ జగ్గులాల్ వివరించారు. అనంతరం పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గోపాల్‌మిత్ర సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, వీరబాబు, గ్రామ పాడి రైతులు పాల్గొన్నారు.

# ఫ్లాగ్ షిప్ కార్యక్రమాలను రెగ్యులర్‌గా అప్‌డేట్ చేయాలి

**-సిబ్బంది హాజరు బయోమెట్రిక్ విధానంలో నమోదు చేయాలి**
**-జిల్లా అధికారులతో సమీక్షించిన కలెక్టర్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఫ్లాగ్ షిప్ కార్యక్రమాల వివరాలను రెగ్యులర్‌గా అప్‌డేట్ చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై అదనపు కలెక్టర్లు డా॥ పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలు, సన్న బియ్యం, రేషన్ కార్డులు, ధాన్యం కొనుగోలు మొదలైన వివిధ కార్యక్రమాల అమలు వివరాలను అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా నిర్ణీత గూగుల్ షీట్ ప్రొఫార్మలో ప్రతి శుక్రవారం అప్‌డేట్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పెండింగ్ ప్రజావాణి దరఖాస్తులను జనవరి తొమ్మిది వరకు డిస్పోజ్ చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి దరఖాస్తును అటెండ్ చేయాలని, మన పరిధిలో లేని దరఖాస్తులను సంబంధిత కార్యాలయాలకు బదిలీ చేయాలని, నిబంధనల ప్రకారం చేయలేని దరఖాస్తులను కారణాలు తెలుపుతూ తిరస్కరించాలని, ఎట్టి పరిస్థితుల్లో దరఖాస్తులు పెండింగ్ పెట్టవద్దని కలెక్టర్ అన్నారు. సర్వే ల్యాండ్ రికార్డ్స్ 31 పెండింగ్ ప్రజావాణి దరఖాస్తులు ఉండటం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు పంపే దరఖాస్తులను ప్రాధాన్యత క్రమంలో క్లియర్ చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ ఉద్యోగుల హాజరు బయోమెట్రిక్ విధానంలో తప్పనిసరిగా నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నెస్పి క్వార్టర్స్ స్థితిగతులపై నివేదిక అందించాలన్నారు. అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుర్తించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. విద్యుత్ లైన్ తరలింపు కోసం డిడి చెల్లించినా కూడా పనులు ప్రారంభం కావడం లేదని విద్యుత్ శాఖాధికారులు పనులు వేగవంతం చేయాలన్నారు. చింతకానిలో నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు మూడు ఎకరాల స్థలం గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, జెడ్పి సిఈవో దీక్షారైనా, డిఆర్డివో సన్యాసయ్య, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# లైంగిక వేధింపుల చట్టం కట్టుదిట్టంగా అమలు చేయాలి

**-అవగాహన కార్యక్రమంలో కలెక్టర్**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** లైంగిక వేధింపుల నిరోధక చట్టం కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో పోష్ యాక్ట్ 2013పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్లు డా॥ పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2013 క్రింద పని ప్రదేశాలలో మహిళలను వేధింపులకు గురిచేయడం నేరం క్రింద పరిగణించాలని తెలిపారు. 10మంది కంటే ఎక్కువ సిబ్బంది పనిచేసే కార్యాలయాల్లో అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. అంతర్గత ఫిర్యాదుల కమిటీలో 50 శాతం మహిళలు ఉండాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో కాకుండా ఫ్యాక్టరీలు,వాణిజ్య సంస్థలు, ప్రైవేటు సంస్థలలో అంతర్గత ఫిర్యాదుల కమిటీలను నెల రోజుల లోపు ఏర్పాటు చేయాలని లేని పక్షంలో రూ. 50వేల జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. చిల్డ్రన్ హోంలో ఉండే అనాథ పిల్లలకు సంబంధిత కుల ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, బర్త్ సర్టిఫికెట్, ఆరోగ్య శ్రీ కార్డు ఉండేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2013కు సంబంధించిన గోడప్రతులను అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, జెడ్పిసిఈవో దీక్షారైనా, డిఆర్‌డివో సన్యాసయ్య, జిల్లా సంక్షేమ అధికారిణి వి. విజేత, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు, డిహెచ్‌ఈడబ్ల్యూ సమీన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాపక్షం/ మధిర :** సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తతో ఉండాలని, గంజాయి డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండి మంచి ప్రవర్తనతో చదువుకుని పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని మధిర టౌన్ ఎస్సై కిషోర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని మహాదేవపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు హెచ్‌ఎం సాధుసమాధానం అధ్యక్షతన జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నేటి సమాజంలో కొందరు విద్యార్థులు సెల్‌ఫోన్లకు బానిసై నేర ప్రవర్తన కలిగి వ్యవహరిస్తున్నారని, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసవుతున్నారని, అటువంటి వాటికి ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని, లేనిపక్షంలో చట్టపరంగా చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. నేరం చేసే వారు ఎంత పెద్ద వారైనా కఠినంగా శిక్షించబడతారని ఆయన అన్నారు. సెల్‌ఫోన్‌లో వచ్చే ఓటిపిలు, ఎకేపి వంటి ఫైల్స్‌ను ఎట్టి పరిస్థితుల్లో ఓపెన్ చేయకూడదని, అపరిచితుల నుండి వచ్చే వాట్సాప్ వీడియో కాల్స్ ఎట్టి పరిస్థితుల్లో లిఫ్ట్ చేయకూడదని డిజిటల్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఈ విషయాలను తల్లిదండ్రులు కూడా తెలియపర్చాలని ఆయన అన్నారు. అదేవిధంగా మైనార్టీ తీరని పిల్లలు వాహనాలను నడిపితే కఠినంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ప్రకాశ్‌రెడ్డి, టౌన్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఖమ్మంలోని న్యూ విజన్ హై స్కూల్ లో ఇటీవల జరిగిన కరాటే పోటీలలో సత్తుపల్లి విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. కట్టా ఈవెంట్లో సిహెచ్.రేవంత్ కుమార్, ఎం.యోగిత బ్రాంజి మెడల్ సాధించగా టి. తరుణ్ వర్దన్ ఎస్కే.ఖాజా అఫ్రీన్ సిల్వర్ మెడల్ సాధించారు. గోల్డ్ మెడల్ సాధించిన వారిలో జి.నిత్య ,ఎన్. దీక్ష, టి.ఉమాశ్రీ, ఎన్ .శైలజ, ఎం ప్రవీణ్ కుమార్ లు ఉన్నారు. సోమవారం జరిగన కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కరాటే మాస్టర్ వి.పిచ్చయ్య ,పట్టణ ప్రముఖులు, అధికారులు అభినందించారు.

# 12,682 మెట్రిక్ టన్నుల యూరియా లభ్యత

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలో ప్రస్తుతం 12,682 మెట్రిక్ టన్నుల యూరియా లభ్యత ఉందని ఎటువంటి కొరత లేదని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని మండలాల్లో రైతులకు సకాలంలో యూరియా పంపిణీ చేసేందుకు సమగ్ర చర్యలు చేపట్టామని ఆయన తెలిపారు. మార్క్‌ఫెడ్ ద్వారా యూరియా నిల్వలను ప్యాక్స్ (ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు), ప్రైవేటు డీలర్లకు అందుబాటులోకి తీసుకు రావడానికి అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో 12,682 మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ అందుబాటులో ఉందని ఇప్పటి వరకు 25,773 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసినట్లు కలెక్టర్ తెలిపారు. యూరియా సరఫరా కేంద్రాల వద్ద రైతులకు త్రాగునీరు, కుర్చీలు, టెంటు వంటి సదుపాయాలు కల్పించినట్లు, రైతులు టోకెన్లు పొంది వాటి ప్రకారం యూరియా తీసుకుని వెళ్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా 185 కేంద్రాల్లో యూరియా పంపిణీ జరిగినట్లు తెలిపారు. రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లాలో కావాల్సినంత యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే మండల వ్యవసాయ అధికారి, ఏఈవోల దృష్టికి తీసుకు రావాలని కలెక్టర్ తెలిపారు.

# దాతల సహకారంతో క్రీడా దుస్తుల పంపిణీ



**ప్రజాపక్షం/మధిర :** మధిర మండల పరిధిలోని మాటూరు ఉన్నత పాఠశాలలో సోమవారం పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బొగ్గు ల శ్రీనివాస్‌రెడ్డి అల్లుడు మహిపాల్ రెడ్డి, శ్రీ వైష్ణవి దంపతుల దాతృత్వంతో క్రీడా దుస్తులను ఎంఇఓ వై.ప్రభాకర్ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేయటం జరిగింది. ఈ సందర్భంగా ఎంఇఓ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు దాతలు ముందుకు వచ్చి వారికి అవసరమయ్యే మౌలిక వసతులు, ఇతర వస్తువులు అందించటం అభినందనీయమనని అన్నారు. దాతల దాతృత్వం చక్కని చేయూతలా ఉపయోగించుకుని ప్రభుత్వ పాఠశాలల బలోపేతం చేసే దిశగా ఉపాధ్యాయులు నడవాలని సూచించారు. విద్యార్థులకు సుమారు రూ.10వేలు విలువ చేసే క్రీడా దుస్తులను అందించిన దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కొట్టె వెంకట్రావమ్మ, పాఠశాల ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



**ప్రజాపక్షం/మధిర :** త్వరలో జరుగనున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, 9వ డివిజన్ మాజీ కౌన్సిలర్ మల్లాది వాసు పిలుపునిచ్చారు. సోమవారం మధిర మున్సిపాల్టీ పరిధిలోని 9వ డివిజన్‌లో ఇన్‌చార్జిలు అంబటి వెంకటేశ్వరరావు, నేతాజి ఆధ్వర్యంలో డివిజన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క ఆదేశాల మేరకు డివిజన్ సమావేశాలను నిర్వహించి నూతన కమిటీలను ఎన్నుకోవటం జరుగుతుందని తెలిపారు. రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తన్నీరు రామకృష్ణ, కర్నాటి అశోక్, శ్రీనినవాసరాజు, బండి ప్రశాంతి, మునుగోటి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు కూపన్ల పంపిణీ





**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం లింగన్నపాలెం, విప్పల మడక, గన్నవరం, గోవిందాపురం గ్రామాల్లో యూరియా పంపిణీ చేయడం జరిగింది. ఈ పంపిణీ కార్యక్రమం ఉదయం 6గంటల నుండి ఏఈవోలు ముందస్తుగా గ్రామాల్లో యూరియా కూపన్లు రైతులకి పంపిణీ చేయడం జరిగింది. తదనంతరం వెంటనే రైతులు సొసైటీలో యూరియా తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి, వైరా మండల తహశీల్దార్ సిహెచ్.సురేష్, ఎంపిడివో బి.సక్రియ, వైరా సబ్ ఇన్స్‌పెక్టర్స్‌లు పుప్పాల రామారావు, పవన్‌లు పర్యవేక్షించారు. సోమవారం కూపన్లు ద్వారా మండలంలో 1400 యూరియా బాగ్స్ పంపిణీ చేయడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి మయాన్ మంజుఖాన్ తెలియజేశారు. సరిపడనంత యూరియా ఉందని రైతులు కృత్రిమ కొరతను దయచేసి సృష్టించవద్దని మండల వ్యవసాయ అధికారి కోరారు. అవసరమైన రైతులు మాత్రమే యూరియా కోవాల్సిందిగా కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయా సర్పంచ్‌లు మేడా హెమియా చక్రపాణి, రంగిశెట్టి కళావథి, చంగల పరశురాములు, కారుమంచి యేసు, వ్యవసాయ విస్తరణ అధికారులు సైదులు, వాసంతి, కీర్తి, పంచాయతీసెక్రటరీలు, గ్రామపాలనఅధికారులు పాల్గొన్నారు.

# పాఠశాలల బస్సులు తనిఖీ





**ప్రజాపక్షం/వైరా:** 37వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా స్కూల్ బస్సుల యొక్క తనిఖీ నిర్వహించడం జరిగింది. ఈ తనిఖీల్లో భాగంగా స్కూల్ బస్సు యొక్క ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌లు, ఇతర సర్టిఫికెట్లు వెరిఫై చేయడం జరిగింది. ఈ తనిఖీల్లో టాక్స్ కట్టని రెండు వాహనాలను సీజ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్ ఏ.వరప్రసాద్, ఎల్.రాజశేఖర్, అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్ కె.స్పార్టకస్, కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు, హోంగార్డ్ అలి, రవాణా శాఖ వైరా సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా సీమంతం వేడుకలు



**ప్రజాపక్షం/ బోనకల్ :** బోనకల్ మండలం మోటమర్రి అంగన్వాడీ సెంటర్‌లో సోమవారం సీమంతం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఏకరూప దుస్తులను సర్పంచ్ మర్రి సురేష్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సూపర్వైజర్ కె.సు జాత మాట్లాడుతూ చిన్నప్రాయంలో పిల్లలకు సమానత్వంపై బేధాభిప్రాయాలు రాకుండా ఏకరూప దుస్తులు ఎంతోఉపయోగపడతాయని, కులమత బేధాలకు తావులేకుండా సమానత్వంతో విద్యార్థుల మనసులో నాటుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాకేష్, ఏఎన్‌ఎం లలిత, ఉపసర్పంచ్ కిరణ్, వార్డు సభ్యులు గోదా విశ్వనాథం, అంగన్వాడీ టీచర్ ఎం.హేమలత, ఎస్కే ఫాతిమున్నిబేగం, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఘనంగా బొమ్మల కొలువు వేడుకలు



**ప్రజాపక్షం/వైరా:** సంక్రాంతి సంబరాల్లో భాగంగా ధనుర్మాసంలో సోమవారం నుంచి వాణి వివేకానంద విద్యాలయంలో బొమ్మల కొలువును ఘనంగా ఏర్పాటు చేశారు. పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు అనేక రకాల బొమ్మలను తీసుకొని వచ్చి టీచర్స్ సహకారంతో సరస్వతి అమ్మవారి దగ్గర అద్భుతమైన రీతిలో బొమ్మలను పెట్టడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ , ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు, వాణి మాట్లాడుతూ సంక్రాంతి పండుగ విశిష్టతను తెలుపుతూ విద్యార్థుల్లో భక్తిభావాన్ని పెంపొందిస్తూ ఈ యొక్క బొమ్మల కొలువును ఏర్పాటు చేయడం జరిగిందని, సరస్వతి అమ్మవారి ఆశీర్వాదాలతో విద్యార్థులందరికి చదువుపై ఏకాగ్రత కలిగి ఉండాలని ఈ నూతన సంవత్సరంలో మా విద్యార్థులందరికి మంచి జరగాలని వారు తెలియజేశారు. అనంతరం విద్యార్థులందరిని పూలతో ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కన్వీనర్ గింజుపల్లి జనార్ధన్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు , తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వృద్ధులకు, వికలాంగులకు అల్పాహారం



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండల పరిధిలోని పాలడుగు గ్రామంలో గల గ్రేస్ ప్రార్ధన మం దిరం నందు 16వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. దేవుని చిత్త ము జరిగించు వారు నిరంతరం నిలుస్తారని దైవ సేవకులు తెలియజేశారు. అనంతరం మందిర వార్షికోత్సవం సందర్భంగా మండల పరిధిలోని గొల్లపూడి గ్రామంలో గల వృద్ధులకు, బోనకల్‌లో గల వృద్ధులకు, శాంతి నిల యంలో గల మానసిక వికలాంగులకు అల్పాహారం వితరణగా అందజేశారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ వృద్ధులందరూ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు.

## నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** విద్యా సంస్థల నిర్వాహకులు పాఠశాలలో కళాశాలలో ఏర్పాటు చేసుకున్న బస్సులకు తప్పనిసరిగా ఫిట్నె స్ కలిగి ఉండాలని జూలూరుపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ లక్ష్మి పేర్కొన్నారు. జూలూరుపాడు మండల కేంద్రంలో స్కూల్ బస్సులను తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జూలూరుపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ లక్ష్మి మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యాలు ప్రతి బస్సు ఫిట్నెస్ సర్టిఫికెట్ తీసుకున్న తర్వాతనే విద్యార్థులను ఎక్కించుకోవాలని తెలియజేశారు. విద్యాసంస్థల నిర్వాహకులు పాఠశాల బస్సులను తప్పనిసరిగా ఫిట్నెస్ చేపించుకోవాలి. దాంతో పాటు బస్సులో ఫస్ట్ ఎయిడ్ కిట్టు ఫైర్ కిట్టు తప్పనిసరిగా ఉండాలి. ప్రతి బస్సుకు అనుభవజ్ఞులైన లైసెన్స్ కలిగిన డ్రైవర్లను ఏర్పాటు చేసుకోవాలి. ప్రతి బస్సుకు డ్రైవర్తోపాటు మరో వ్యక్తి ఫుట్ బోర్డ్ వద్ద ఉండాలి. విద్యా సంస్థల బస్సులు నడిపే డ్రైవర్లు మద్యం మత్తులో బస్సులు తోల వద్దని సూచించారు. అదే విధంగా విద్యాసంస్థల వాహనాల్లో లౌడ్ స్పీకర్స్ లాంటివి ఏర్పాటు చేయవద్దని తెలిపారు. ప్రతి పాఠశాల కళాశాల బస్సులు ఫిట్నెస్ తోపాటు అన్ని ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని, ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. నిబంధనలు పాటించకుండా బస్సుల్లో పరిమితికి మించి పిల్లలను ఎక్కించిన అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై భాదవత్ రవి తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రంప్ దిష్టిబొమ్మ దహనం




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** వెనిజుల దేశంపై అమెరికా యుద్ధం చేయడాని తీవ్రంగా వ్యతిరేకి స్తూ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ సత్తుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో పాత సెంటర్ లోని కాకర్లపల్లి రింగ్ వద్ద అమెరికా అధ్యక్షుడు ట్రంపు దిష్టిబొమ్మను సోమవారం దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు అమర్లపూడి శరత్ మాట్లాడుతూ అమెరికా దేశం వెనుకబడ్డ దేశాలు, అధిక ఖనిజాలు ఉన్న దేశాలపై అక్రమ దాడులు చేసి ఆధిపత్యం కోసం ఎదురు చూస్తుందని అందులో బాగమే చమురు సంపద ఉన్న వెనిజులని ఆక్రమించడమని మండిపడ్డారు. ప్రపంచాన్ని తన గుప్పెట్లో పెట్టుకోవడానికి ట్రంప్ అక్రమంగా కాకుండా సక్రమంగా పోరాడాలని, తక్షణమే వెనుజుల అధ్యక్షుడు నికోలాస్ మధురో, ఆయన భార్యను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రపంచ ఆధిపత్యానికి వ్యతిరేకంగా వెనుజుల ప్రజల కు అండగా నిలబడదామన్నారు. భారత దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గంటా నారాయణ, మణికల వెంకటేశ్వర్లు, పాకాల ప్రకాష్ రావు, ఉప్పువ్వ వెంకటేశ్వరావు, సంజీవరావు, నాగరాజు, సత్తిబాబు, వెంకటేశ్వరావు , ఈశ్వచారి తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ శత వసంతాల ముగింపు సభను జయప్రదం చేయండి

**-సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల, శింగు**






**ప్రజాపక్షం/బోనకల్:** భారతదేశ గడ్డపై మహోజ్వల పోరాటాల, త్యాగాల చరిత్ర నిర్మితమైనది సిపిఐ అని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి అన్నారు. సిపిఐ శత వసంతాల ముగింపు సభను జయప్రదం చేయాలని కోరుతూ ప్రచార జాతా మోటమర్రి, కలకోట, రాయన్నపేట, ఆళ్లపాడు, బోనకల్, ముష్టికుంట్ల గ్రామాల మీదుగా జాతా కొనసాగింది. ఆయా గ్రామాల సిపిఐ శ్రేణులు జాతా ప్రతినిధులను ఘనస్వాగతం పలికారు. ముందుగా మోటమర్రిలో జాతాలో జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ 1925 డిసెంబరు 26న ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో సిపిఐ ఆవిర్భవించదన్నారు. మార్క్సిజం, లెనినిజం సిద్ధాంతాల పునాదులపై ఆవిర్భవించి నేటికి పోరాడుతుందన్నారు. భారత దేశ చరిత్రలో కమ్యూనిస్టు పార్టీది ప్రముఖ పాత్ర అని పేర్కొన్నారు. దోపిడికి పాల్పడుతున్న వర్గాలకు వ్యతిరేకంగా మార్క్స్ సిద్ధాంతాన్ని ఆచరిస్తూ ఎన్నో విజయాలు సాధించిందని తెలిపారు. వేలాది మంది అమరుల త్యాగాలతో ఈ విజయాలు సాధ్యమయ్యాయని అన్నారు. అనాటి నుండి నేటి వరకు ప్రజాక్షేత్రంలో అలుపెరగని పోరాటాలు సాగిస్తోందన్నారు. ఆ ఉద్యమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పార్టీ చరిత్రను కార్యకర్తలు వాడ వాడలా వివరించాలన్నారు. జనవరి 18న ఖమ్మంలో శత వసంత ఉత్సవ ముగింపు సభను 5 లక్షల మందితో నిర్వహిస్తున్నారు. ప్రపంచ దేశాల నుంచి కమ్యూనిస్టు ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. ఏఐటియూసి రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు మాట్లాడుతూ దేశంలో భూసంస్కరణలు, కార్మిక హక్కులు అనేక సంక్షేమ పథకాలు కమ్యూనిస్టు పోరాటాల ఫలితంగా వచ్చాయని గుర్తు చేశారు. పేదలు, దళితులు, మైనార్టీలు, బలహీన వర్గాల అభ్యున్నతికి, ప్రజల హక్కుల సాధన కోసం సిపిఐ నిరంతర పోరాటాలు చేస్తోందన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు నేటికి పూర్తిగా అమలు కావడం లేదని, నరేంద్రమోడీ ప్రధాని అయ్యాక రాజ్యాంగానికే ప్రమాదం వచ్చిపడిందని విమర్శించారు. మహిళలు, మైనార్టీలపై దాడులు పెరుగుతున్నాయని, ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని ఆరోపించారు. విభజన, విద్వేష రాజకీయాలలో బిజేపీ దేశ సమగ్రతకు సవాల్‌గా మారిందన్నారు. ప్రభుత్వ సంస్థల నిర్వీర్యం, కార్పోరేట్ సంస్థల అధిపత్యం పెరిగిపోయి దేశ సంపద కార్పోరేట్ల జేబుల్లోకి వెలుతుందన్నారు. ఆయా సమస్యలపై సిపిఐ నిర్మాణాత్మక ప్రజా ఉద్యమాలు కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ముగింపు సభకు ఊరూ వాడ కదిలి శత ఉత్సవాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, సిహెచ్ సీతామహాలక్ష్మి, మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సహాయ కార్యదర్శి బుర్రి నాగేశ్వరరావు, నాయకులు మాతంగి శ్రీనివాసరావు, యంగల వెంకటమ్మ, శాఖ కార్యదర్శి వంగాల కృష్ణ, తోటపల్లి ఆనందరావు, సొసైటీ డైరెక్టర్ మరీదు వెంకటేశ్వర్లు, తోటపల్లి సునీత, మాతంగి సామ్రాజ్యం, యంగల కృష్ణవేణి, బుంగ నరసింహ, బుంగ గోపి, బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, కొంగర భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ వందేళ్ల పండుగకి తరలిరండి



**ప్రజాపక్షం/ మధిర :** భారతగడ్డపై నూరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) అని, ఈ వందేళ్లు సిపిఐ పేదలు, బడులు, బలహీన వర్గాల కోసం పోరాటాలు సాగించిందని, రానున్న మరో వందేళ్లు కూడా ఇదే స్ఫూర్తితో ప్రజా క్షేత్రంలో మనగలమని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు, సింగు నర్సింహారావు అన్నారు. సిపిఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి కావడంతో ఈనెల 18న ఖమ్మం వేదికగా 5లక్షల మందితో నిర్వహించే శతాబ్ది ఉత్సవాల ముగింపు భారీ బహిరంగ సభ ప్రదర్శనను జయప్రదం చేయాలని కోరుతూ ఈ నెల 3న సత్తుపల్లిలో ప్రారంభమై ప్రచార జాతా సోమవారం మధిరకు చేరుకుంది. ప్రజానాట్యమండలి కళాకారుల జాతాకి ముందుభాగాన నిలిచి వందేళ్లు సిపిఐ పోరాట చరిత్రను పాటల రూపంలో ప్రజలకు వివరించారు. అనంతరం మధిర పట్టణం, మడుపల్లి, మల్లవరం గ్రామాల్లో సిపిఐ మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు అధ్యక్షతన జరిగిన సభల్లో వారు మాట్లాడారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజా సమస్యలు పరిష్కారం, అభ్యున్నతి కోసం పుట్టిన పార్టీయే సిపిఐ అని, అందువలననే ప్రజల ఆదరణతో సిపిఐ వందేళ్ల పోరాట చరిత్ర కొనసాగించిందని, మునుముందు కూడా ఇదే స్ఫూర్తితో మరో వందేళ్లపాటు సిపిఐ అలుపెరగని పోరాటాలు చేస్తుందని స్పష్టం చేశారు. జనవరి 18న ఖమ్మంలో జరిగే శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు మధిర మండల వ్యాప్తంగా వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.

## సిపిఐ నూరేళ్ల చరిత్ర ప్రజా పోరాటాలతోనే మమేకం

**- దేశ భవితకు కమ్యూనిజమే మార్గం**
**- జమ్ముల జితేందర్‌రెడ్డి**



**ప్రజాపక్షం/మధిర :** భారత గడ్డపై సిపిఐ నూరేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 18న ఖమ్మంలో జరిగే సిపిఐ వంద సంవత్సరాల ముగింపు బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ సిపిఐ జిల్లా ప్రచార జాతా సోమవారం మధిర మండలం మాల్లారం గ్రామం చేరింది. గ్రామంలోని కార్యకర్తలు భారీగా బైకులతో స్వాగతం పలికారు. మల్లారం గ్రామంలో గ్రామ మాజీ సర్పంచ్ అమరజీవి మచ్చా హన్మంతరావు, మాజీ ఎంపిటిసి అమరజీవి మందడపు నాగేశ్వరరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామ కార్యదర్శి పరుచూరి రాము అధ్యక్షతన జరిగన సభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ నూరేళ్ల చరిత్రలో అలుపెరగని పోరాటాలు చేసి అనునిత్యం ప్రజల గుండెల్లో ఉన్న పార్టీ సిపిఐ అని అన్నారు. దేశవ్యాప్తంగా సమరశీల పోరాటాలు నిర్వహించిన చరిత్ర ఉందని, రాష్ట్రంలో ఏ ఊరు వెళ్లిన భారత కమ్యూనిస్టు పార్టీ అడుగుజాడలు కనబడుతూనే ఉంటాయని, దానిని చెరపటం ఎవరి తరం కాదని ఆయన అన్నారు. దేశంలో మతోన్మాద శక్తులు కమ్యూనిస్టులపై అనేక దాడులు చేస్తున్నారని, ఈ క్రమంలో ప్రజలు చైతన్యవంతులై ఈ మతోన్మాద ప్రభుత్వానికి బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఖమ్మం జిల్లాకు ఒక సుదీర్ఘమైన చరిత్ర ఉందని, ఈ జెండాని ఖమ్మం జిల్లా ప్రజలు కడుపులో పెట్టుకుని ప్రేమించారని, ఖమ్మం జిల్లా అంటే పోరాటాల ఖిల్లాగా పేరు ఉందని, ఈగడ్డపై దేశ వ్యాప్త భారత కమ్యూస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాలు ముగింపు సభ జనవరి 18న జరుగుతుందని, ఈ సభకు వేలాదిగా సిపిఐ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు తరలివచ్చి విజయంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సింగు నర్సింహారావు, సీతామహాలక్ష్మి , మందడపు రాణి, సిపిఐ మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు, నాయకులు మచ్చ వెంకటేశ్వరరావు, పద్మ, కొంగర మురళీ, గరిడేపల్లి వెంకటేశ్వరరావు, ఎర్ర నాగులు, సైదులు, మందడపు మురళీకృష్ణ, సుజాత, కృష్ణారావు, వెంకటలక్ష్మి , మరియమ్మ, అరిగెల రవి, సాయి తదితరులు పాల్గొన్నారు

## కమ్యూనిస్టు పార్టీకి గ్రామీణ ప్రజలే బలం

**-గిరిజనులకు పోడు పట్టాల కోసం కొట్లాడింది, కొట్లాడేది సిపిఐనే..**
**-సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా**









**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ప్రజా హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న పార్టీ ఒక్క సిపిఐ పార్టీ మాత్రమేనని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. సోమవారం సిపిఐ ప్రచార జాతలో భాగంగా మండల పరిధిలోని మర్కోడు నుండి అనంతోగు వరకు సిపిఐ పార్టీ కార్యకర్తలు సుమారు 200 బైకులతో భారీ ర్యాలీతో ప్రచార జాతా ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సిపిఐ ఆళ్లపల్లి మండల కార్యదర్శి కొమరం హనుమంతరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా మాట్లాడుతూ పదవులు ఉన్నా లేకున్నా ఎప్పటికీ ప్రజలతోనే మమేకమై వారి సమస్యలను పరిష్కరించేందుకు ఉద్యమించిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని, ఎన్నో పార్టీలు పుట్టాయని అలాగే కాలగర్భంలో కలిసిపోయాయని కానీ ప్రజాదరణతో వందేళ్లు పూర్తి చేసుకున్న ఏకైక పార్టీ సిపిఐ మాత్రమే అన్నారు. ఈ దేశ స్వాతంత్ర ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజలను సమీకరించి పోరాటంలో అగ్రభాగాన నిలిచి అనేక త్యాగాలు చేసిన పార్టీ సిపిఐ మాత్రమే, కార్మిక విద్యార్థి రైతు మహిళ వ్యవసాయ కార్మిక యువజన, అనేక ప్రజా సంఘాల నిర్మించి ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటలు నిర్వహించారు. ఈ దశాబ్ద కాలంలో దేశ సమైక్యత కోసం ప్రజా సమస్యలు పరిష్కారం కోసం ఎన్నో త్యాగాలు ఎంతో మంది అమరవీరుల రక్తార్పణంతో ప్రజల కోసం పోరాటలు నిర్వహించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నాలగున్నర వేల మంది ప్రాణ త్యాగాలతో 3000 గ్రామాలలో భూస్వాముల దొరల ఆగడాల నుండి ప్రజల విముక్తి కల్పించి, భూమిలేని పేదలకు పది లక్షల ఎకరాల భూమిని పంచిన మహత్తర చరిత్ర కలిగిన పార్టీ సిపిఐ అని వంద సంవత్సరాల ముగింపు ఉత్సవాల సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో లక్షలాది మందితో బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు రేసు ఎల్లయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వర్క అజిత్, అధ్యక్షులు ఎస్‌కే షాహిద్, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు వేల్పుల మల్లికార్జున్, జిల్లా సమితి సభ్యులు గొగ్గల కృష్ణ, మండల సహాయ కార్యదర్శిలు నరెడ్ల రాంబాబు, వజ్జా పగడయ్య, ఎస్‌కే రహీం, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కాటూరి రాము, సీనియర్ నాయకులు శ్రీరామ సమ్మయ్య, డీకొండ మల్లేష్, కుంట సహదేవ్, నరేడ్ల శివ, రేసు సురేందర్, గుంతోజు శివ, మద్దెల వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, కల్తీ భద్రయ్య, గొగ్గల లక్ష్మి , తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐలో పలువురి చేరిక



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఆళ్లపల్లి మండలంలో సోమవారం జరిగిన సిపిఐ ప్రచార జాతలో ఆళ్లపల్లి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి పూనెం వెంకటేష్, మర్కోడు గ్రామానికి చెందిన పాషా, సుద్దరేవు గ్రామానికి చెందిన పూనెం క్రిష్ణలు సిపిఐ జిల్లా నాయకులు రేసు ఎల్లయ్య, సిపిఐ మండల కార్యదర్శి కొమరం హనుమంతరావు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వీరికి సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, రాష్ట్ర నాయకులు ముత్యాల విశ్వనాథం కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు రేసు ఎల్లయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వర్క అజిత్, అధ్యక్షులు ఎస్‌కే షాహిద్, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు వేల్పుల మల్లికార్జున్, జిల్లా సమితి సభ్యులు గొగ్గేల కృష్ణ, మండల కార్యదర్శి కొమరం హనుమంతరావు, మండల సహాయ కార్యదర్శిలు నరెడ్ల రాంబాబు, వజ్జా పగడయ్య, ఎస్‌కే రహీం, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కాటూరి రాము, సీనియర్ నాయకులు శ్రీరామ సమ్మయ్య, డీకొండ మల్లేష్, కుంట సహదేవ్, నరేడ్ల శివ, రేసు సురేందర్, గుంతోజు శివ, మద్దెల వెంకటేశ్వర్లు, సూర్య నారాయణ, కల్తి భద్రయ్య, గొగ్గల లక్ష్మి , తదితరులు పాల్గొన్నారు.

## 7న జూలూరుపాడు రానున్న జాతాకు ఘనస్వాగతం పలకాలి

**సీపీఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు**




**ప్రజాపక్షం/జూలూరుపాడు:** సీపీఐ 100 సంవత్సరాల ముగింపు ఉత్సవాల సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో జరిగే బహిరంగ సభ విజయవంతం కోసం సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా సారధ్యంలో ఈ నెల మూడో తేదీన చర్లలో ప్రారంభమైన జాత ఏడవ తేదీన జూలూరుపాడు చేరుకుంటుందని సీపీఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఈ దేశ స్వాతంత్ర ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజలను సమీకరించి పోరాటంలో అగ్రభాగాన నిలిచి అనేక త్యాగాలు చేసిన పార్టీ సీపీఐ మాత్రమే, కార్మిక విద్యార్థి రైతు మహిళా వ్యవసాయ కార్మిక యువజన, అనేక ప్రజా సంఘాల నిర్మించి ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటలు నిర్వహించారు. ఈ దశాబ్ద కాలంలో దేశ సమైక్యత కోసం ప్రజా సమస్యలు పరిష్కారం కోసం ఎన్నో త్యాగాలు ఎంతోమంది అమరవీరుల రక్తార్పణంతో ప్రజల కోసం పోరాటలు నిర్వహించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నాలుగున్నర వేల మంది ప్రాణ త్యాగాలతో 3000 గ్రామాలలో భూస్వాముల దొరల ఆగడాల నుంచి ప్రజల విముక్తి కల్పించి భూమిలేని పేదలకు పది లక్షల ఎకరాల భూమిని పంచిన మహత్తర చరిత్ర కలిగిన పార్టీ సిపిఐ అని వంద సంవత్సరాల ముగింపు ఉత్సవాల సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో లక్షలాది మందితో బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. దేశం స్వతంత్రం కోసం ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిర్వహించిన పోరాటాలను త్యాగాలను నేటి యువతరానికి గుర్తు చేస్తూ ఈ నెల 7న మూడు గంటలకు జూలూరుపాడుకు ఈ జాత చేరుకుంటుందని జూలూరుపాడు మండల కేంద్రంలో నిర్వహించే సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి, ఎస్కే నాగుల్ మీరా, సీపీఐ నాయకులు ఎల్లంకి మధు, సిరిపురపు వెంకటేశ్వర్లు, వల్ల మల్ల సామేలు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యాస రోశయ్య, దేవినేని రాము, చలగొండ్ల సతీష్, యల మద్దిసాయి కృష్ణ, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కే చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ అభివృద్ధే లక్ష్యం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** నకిరిపేట గ్రామ పంచాయితీ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు సర్పంచ్ శర్మా నాగమణి అన్నారు. సోమవారం గ్రామ పంచాయితీలో ఆమె అధ్యక్షతన నూతన పరిపాలన సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా గ్రామ పంచాయితీలోని సమస్యలను, మౌళిక సదుపాయాల ఏర్పాటుపై చర్చించారు. పంచాయితీలో ప్రజలకు ఎటువంటి సమస్యలు లేకుండా చూడటం కోసం నిరంతరం తమ పాలకవర్గం కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం నకిరిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పాలకవర్గంతో కలిసి సందర్శించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఎన్ని గదులు ఉన్నాయని, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా నూతనంగా గ్రామ పంచాయితీలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను కూడా పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ బండారి లింగమ్మ, మాజీ సర్పంచ్ శర్మా వెంకటేశ్వర్లు, బిఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు బండారి లక్ష్మి నారాయణ, గ్రామ పంచాయితీ కార్యదర్శి, వార్డు సభ్యులు తాటి ఎర్రయ్య, తాటి సారయ్య, సవలం చంద్రకళ, మల్లిక, దాసరి మల్సూర్ పాల్గొన్నారు.

## చంటి మరణం బాధాకరం



**ప్రజాపక్షం/కారేపల్లి:** భాగ్యనగర్ తండాకు చెందిన ధారావత్ చంటి(32)జీవనం నిమిత్తం హైదరాబాద్‌లో నివసిస్తూ ఆదివారం రాత్రి గుండెపోటుతో మరణించారు. వారి పార్థివదేహంను స్వగ్రామానికి తీసుకురాగా భాగ్యనగర్ తండా సర్పంచ్ హీరాలాల్ సందర్శించి పూల మాలలతో నివాళులర్పించారు. ఈసందర్భంగా కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎంపిటిసి ఆలోత్ ఈశ్వరి బాయ్, నాయకులు తేజవత్ ఈశ్వర్, తారాచంద్, నందరాజ్, బాలు, రాందాస్, తదితరులు పాల్గొన్నారు.

## శత వసంత ముగింపు సభను జయప్రదం చేద్దాం




**ప్రజాపక్షం/కారేపల్లి:** శత వసంత ముగింపు సభను జయప్రదం చేద్దామని సిపిఐ మండల కార్యదర్శి పాపినేని సత్యనారాయణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సిపిఐ మండల పార్టీ కౌన్సిల్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 18వ తేదీన జరిగే శత వసంత ముగింపు సభను జయప్రదం చేయాలని, నేడు(మంగళవారం)మండలానికి ప్రచార జాత రాబోతుందన్నారు. అన్ని గ్రామల శాఖ నాయకులు ఈకార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. బాజు మల్లయ్యగూడెం, చీమలపాడు ఉదయం 10గంటలకు, గాదెపాడు ఉదయం 11గంటలకు, కారేపల్లి మండల కేంద్రం మధ్యహ్నం 2గంటలకు జిల్లా ప్రచార జాత చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో మండలనాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులను యధావిధిగా కొనసాగించాలి



**ప్రజాపక్షం/గుండాల :** మహాత్మగాంధి జాతీయ గ్రామీనణ ఉపాధిహామి పనులను యదావిదిగా కొన సాగించాలని అఖిలభారత రైతూకూళిసంఘంఆద్వర్యంలో సోమవారం కాచనపల్లి గ్రామ పంచాయితి సర్పంచి సర్పు ల కిషన్, కార్యదర్శి మల్లేష్ లకు వినతి పత్రా న్ని అందచేశారు. ఈ సందర్బంగా అటికం శేఖర్ మాట్లాడుతూ ఎన్ఆర్ఇజిఎస్ పథకాన్ని రద్దుచేసి దాని స్థానంలో వి బి రామ్‌జి పథకాన్ని తీసుకు రావాడాన్ని ఖండించారు. దీనితో ఉపాధి కూళీలు తీవ్రంగా నష్ట పోయే అవకాశం ఉందన్నారు. దీనిపై పంచాయితీ పాలక వర్గం తీర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యనగంటి లాజర్, రాము, పుల్లయ్య, వెంకన్న, కుంజ క్రిష్ట తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐలో పలువురి చేరిక



**ప్రజాపక్షం/గుండాల :** సిపిఐ పార్టి శత వసంతాల వేడుకల సన్నాహక సమావేశాన్ని జయప్రదం చేసేందుకు ఆదివారం గుండాల మండాలానికి విచ్చేసిన సిపిఐ పార్టి జిల్లా జిల్లా కార్యదర్శి ఎస్కే షాబీర్‌పాష సమక్షంలో మండల కేంద్రానికి చెందిన పలువురు సిపిఐ పార్టీ కార్యక్రమాలకు ఆకర్శితులైన కుంజబుచ్చయ్య, బొమ్మెర్ల లాలయ్య లకు పార్టి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ నెల 18న ఖమ్మంలో జరిగే శతవసంతాల వేడుకలను జయప్రదం చేసేందుకు తమవంతు కృషిచేస్తామని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్టసమితి సభ్యులు సరిరెడ్డి పుల్లా రెడ్డి, రేసు ఎల్లయ్య, వాగబోయిన రమేష్, షాహెద్, గడ్డం శ్రీను, ఎస్కే సాహెబ్, సమీర్, బచ్చలి రామయ్య, నాసీర్ తదితరులు పాల్గొన్నారు.

# రానున్న కాలంలో జల ఉద్యమాలు

**-కేటిఆర్ పర్యటనను జయప్రదం చేయండి**
**-మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణలో రానున్న కాలంలో జల ఉద్యమాలు ప్రారంభం కానున్నాయని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూ రు, రంగారెడ్డి పేరుతో తెలంగాణ ప్రయోజనాలను నిర్వీర్యం చేస్తుందని సీతారామ ప్రాజెక్టు విషయంలోనూ కాంగ్రెస్ అజాగ్రత్త భవిష్యత్తులో ఉద్యమానికి దారి తీయనుందని ఆయన తెలిపారు. సోమవారం ఖమ్మంలో ఆయన స్వగృహంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ నూతన సంవత్సరం 2026 తెలంగాణలో పోరాటాల నామ సంవత్సరంగా నిలవనుందన్నారు. ఒక రోజు కేసిఆర్ ఒక ప్రెస్‌మీట్ పెడితేనే కాంగ్రెస్ నేతలు వణికిపోతున్నారని ఇక ఉద్యమం చేపడితే పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించుకోవచ్చునన్నారు. కేసిఆర్ అధికారంలో ఉన్నప్పుడు ప్రతి ఎకరాకు నీటిని అందించారని ఇప్పుడు కాంగ్రెస్‌కు ఆ పని చేత కావడం లేదన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బిఆర్ఎస్ ఘన విజయం సాధించిందని భవిష్యత్తులో ఇదే రీతిలో విజయాలు సాధించనుందని ఆయన తెలిపారు. సీతారామ ప్రాజెక్టు నీళ్లతో కాళ్లు కడుగుతానని హామీ ఇచ్చిన నాయకులు ఇప్పటికైనా ఆ మాటకు సమాధానం చెప్పాలని అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. యూరియా కోసం రైతులు పడుతున్న ఇబ్బందిపై కేసిఆర్ అప్పుడే హెచ్చరించారన్నారు. ఎన్ని ఒత్తిడులు వచ్చినా ప్రజల పక్షాన నిలబడి సహచరులతో కలిసి పోరాడతానని ఆయన స్పష్టం చేశారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ ఈనెల ఏడున ఖమ్మంకు రానున్నారని బిఆర్ఎస్ కార్యాలయంలో ఇటీవల గెలిచిన బిఆర్ఎస్ ప్రతినిధులను సన్మానించనున్నారని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అజయ్‌కుమార్ కోరారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లతో పాటు నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, బిఆర్ఎస్ నాయకులు కూరాకుల నాగభూషణం, ఆర్‌జెసి కృష్ణ, కర్నాటి కృష్ణ, మగ్బూల్, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, ఖమర్, వీరునాయక్, బచ్చు విజయ్‌కుమార్, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**-ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన కలెక్టర్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్లు డా॥ పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సత్తుపల్లిలోని కాకర్ల పల్లి సర్కిల్ వద్ద ఉన్న ఆర్ఆర్ చికెన్ సెంటర్ వల్ల చుట్టు పక్కల నివసించే ప్రజలకు దుర్గంధంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అక్కడి నుంచి చికెన్ సెంటర్‌ను తరలించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ధంసలాపురం గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్వాసితులు ర్యాంపు 3 ఎంట్రీ, ఎగ్జిట్ దగ్గర ఉన్న ప్లాట్లకు దారి ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. వైరా మండలం రెబ్బవరం గ్రామానికి చెందిన సాధన సుబ్బమ్మ తన కుమారుడు మోసం చేసి 30 కుంటల భూమిని బలవంతంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని తిరిగి పొలం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఖమ్మం కార్పోరేషన్ ఏడవ డివిజన్ శ్రీకృష్ణ నగర్‌లో పందుల బెడద ఎక్కువగా ఉందని తగు చర్యలు తీసుకోవాలని దరఖాస్తు చేశారు. ఖమ్మం అర్బన్ మండలం 16వ డివిజన్‌కు చెందిన ఎం. నర్సింహారెడ్డి ధంసలాపురం వద్ద కొత్తగా నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే పక్కన ఉన్న తన పొలంలోకి వెళ్లేందుకు దారి ఏర్పాటు చేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు. దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్ సత్వరమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, జెడ్పిసిఈవో దీక్షారైనా, డిఆర్‌డివో సన్యాసయ్య, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలో ముసాయిదాపై అఖిలపక్షం ఆగ్రహం





**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని ఓటర్ల జాబితా ముసాయిదాపై అఖిలపక్షం ఆగ్రహం వ్యక్తం చేసింది. కల్లూరు లోని మున్సిపాలిటీలో ఓటర్ల జాబితా ముసాయిదాపై అఖిలపక్ష సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో పలువురు రాజకీయ నాయకులు ముసాయిదాపై కమిషనర్ రామచందర్రావు పై ఆగ్రహం వ్యక్తం చేశారు. 20 వార్డులు 18, 864 కాగా అవి 23 పోలింగ్ కేంద్రాలు వార్డుల వారీగా విభజన ప్రక్రియలో తప్పులు తడకలతో పాటు ఓట్లు డబల్ ఉండటం జరిగిందని వాటన్నిటినీ సవరించాలని అఖిలపక్ష నాయకులు మున్సిపాలిటీ కమిషనర్‌ను డిమాండ్ చేశారు . ఒక వార్డులో ఓట్లు మరో వార్డులోకి మరో వార్డులో ఓట్లు ఇంకో వార్డులోకి వెళ్ళటంతో గజిబిజిగా ఓటర్ల జాబితా ఉందని ఇది ఎలా సాధ్యమని అంటూ కమిషనర్‌ను సిపిఐ మండల కార్యదర్శి దామాల దయాకర్ రావు, కాంగ్రెస్ నాయకులు పెద్ద బోయిన నరసింహారావు, న్యాయవాది రావనరసింహారావు, బిఆర్ఎస్ లక్కినేని రఘు, నాయకులతో పాటు పలు రాజకీయ ప్రశ్నించారు. మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డుల్లో కూడా ఓటర్ల జాబితా తికమక గా ఈ ముసాయిదా ఎన్నికల్లో ముప్పు తిప్పలు పెట్టేటట్టుగా ఉందని ఓటర్లు ఇబ్బంది పడతారని కావున ఈ జాబితాను సవరించాలని డిమాండ్ చేస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ పార్లమెంటు ఓటర్ల జాబితా వలె ఉండాలని కొన్ని ఓట్లు డబల్ ఉన్నాయని వాటన్నిటిని పరిష్కరించాలని కోరుతూ అఖిలపక్షంలో పలు రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మేనేజర్ నాగేశ్వరరావు మార్కెట్ కమిటీ చైర్మన్ భాగం నీరజా దేవి, 20 వార్డులలో ఉన్న అధికార ప్రతిపక్ష, వామపక్ష నాయకులు పాల్గొన్నారు.

# నో హెల్మెంట్.. నో పెట్రోల్

**బంకుల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు**



**ప్రజాపక్షం/వైరా:** రోడ్డు భద్రతా వారోత్సవాల నేపద్యంలో వైరా ఎస్సై పుప్పాల రామారావు సోమవారం వైరా మండల పరిధిలోని పెట్రోల్ బంకుల వద్ద హెల్మెంట్ యొక్క ఉపయోగంపై అవగాహన ద్విచక్ర వాహనదారులకు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై రామారావు పెట్రోల్ బంకులు వద్ద నో హెల్మెంట్ పెట్రోల్ అనే ఫ్లెక్సీలను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఎస్సై రామారావు మాట్లాడుతూ పెట్రోల్ బంకులు వద్దకు వచ్చే వాహనదారులకు ప్రతిఒక్కరూ హెల్మెంట్ పెట్టుకునే విధంగా ప్రోత్సహించాలని బంకుల నిర్వాహకులకు తెలిపారు. అదేవిధంగా ద్విచక్ర వాహనదారులను ఆపి ప్రతిఒక్కరూ హెల్మెంట్ వాడాలని, హెల్మెంట్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. హెల్మెంట్ మన ప్రాణానికి ఒక పునాది లాంటిదని, ద్విచక్ర వాహనంపై వెళ్లేటప్పుడు అనుకోని సంఘటనలు జరిగిన ప్రమాదాలు జరిగితే మన ప్రాణాలు పోకుండా కాపాడుతుందని, దాని యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బిఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ ఉప సర్పంచ్



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** కాంగ్రెస్ పార్టీకి చెందిన ఉప సర్పంచ్ బిఆర్ఎస్ పార్టీలో చేరారు. మండల పరిధిలోని బద్యాతండా గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన ఉప సర్పంచ్ నునావత్ రవి నాయక్ బిఆర్ఎస మండల అధ్యక్షులు వీరు నాయక్ , సర్పంచ్ పెంట్యానాయక్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సమక్షంలో సోమవారం బిఆర్ఎస్‌లో చేరారు. రవినాయక్‌కు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మాలోత్ చందన్, గుగులోత్ చిన్న, గ్రామశాఖ అధ్యక్షులు మంగీలాల్, నునావత్ అశోక్ కుమార్, దస్రు నాయక్, లకుపతి, రవీందర్, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# బ్లూమింగ్ మైండ్స్‌లో ఆరెంజ్ కలర్ డే



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని బల్లేపల్లిలో గల బ్లూమింగ్ మైండ్స సెంట్రల్ స్కూల్, జూనియర్ కళాశాలలో ఆరెంజ్ కలర్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం పాఠశాలలో తరగతి గదులను ఆరెంజ్ కలర్ బెలూన్లతో అందంగా అలంకరించారు. చిన్నారులు ఆరెంజ్ కలర్ వస్త్రాలను ధరించి పాఠశాలకు వచ్చారు. ఆరెంజ్ కలర్ ఫ్రూట్స్ తీసుకు వచ్చి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పి. అశోక్ రెడ్డి మాట్లాడుతూ రంగులకు సంబంధించి వేడుకలను జరుపుకోవడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకతతో పాటు ఐకమత్యం పెరుగుతుందన్నారు. ఆరెంజ్ ఫ్రూట్స్‌లో విటమిన్ సి ఉంటుందని రోగ నిరోధకశక్తి పెంపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రంగోత్సవంలో స్మార్ట్‌కిడ్జ్ విద్యార్థుల ప్రతిభ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జాతీయ స్థాయి రంగోత్సవం, హ్యాండ్ రైటింగ్, కలరింగ్ పోటీల్లో స్మార్ట్‌కిడ్జ్ పాఠశాల చిన్నారులు ప్రతిభ కనబర్చి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలల్లోని వివిధ తరగతులకు చెందిన 39 మంది జాతీయ పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించారు. గెలుపొందిన విద్యార్థులను సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య మెడల్స్‌ను అందించి అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. చదువుతో పాటు విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దేందుకు తమ పాఠశాలలో ప్రత్యేక కార్యాచరణ రూపొందించామన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సిపిఐ సీనియర్ కార్యకర్త మృతి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని గూడూరుపాడులోని పిట్టలవారి గూడేనికి చెందిన సిపిఐ సీనియర్ కార్యకర్త గడ్డికొప్పుల భద్రయ్య(90) అనారోగ్యంతో సోమవారం ఇంటివద్ద మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పుచ్చకాయల కమలాకర్ నివాసం వద్దకు చేరుకుని మృతదేహాన్ని సందర్శించి ఎర్రజెండాను కప్పి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అమరజీవి పుచ్చకాయల వెంకటేశ్వర్లుతో కలిసి 1970లో భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. భద్రయ్య మృతి సిపిఐ పార్టీకి తీరనిలోటని, నేటి యువత ఆయను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మృతుడికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సిద్ధినేని కర్ణకుమార్, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, గ్రామ మాజీ సర్పంచ్ బండి ఉపేందర్, గ్రామ నాయకులు కర్ణం ఉపేందర్, పొడేటి అంజయ్య, గోపినపల్లి రామ్మూర్తి, చల్లా రామకృష్ణ, గడ్డికొప్పుల శ్రీను, శీలం ఉపేందర్, కొండయ్య, సంగయ్య, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్ బంక్‌లు నిబంధనలు పాటించాలి



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** పెట్రోల్ బంక్‌లు నిబంధనలు పాటించాలని వినియోగదారుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి బి.ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని హిందూస్థాన్ పెట్రోలియం బంక్‌లో కొలతలు పాటించడం లేదని అందిన ఫిర్యాదు మేరకు ఆయన బంక్‌ను సోమవారం పరిశీలించారు. వినియోగదారున్ని ఫిర్యాదుతో శనివారం మధిర సివిల్ సప్లయి డిటి ప్రసన్న ఎర్రుపాలెం వచ్చి బంక్‌ను పరిశీలించి సోమవారం జిల్లా మెటరాలజీ అధికారి ప్రవీణ్‌కుమార్ వచ్చి పరిశీలిస్తారని అప్పటి వరకు బంక్‌లో పెట్రోల్ అమ్మకాలు చేయవద్దని చెప్పి వెళ్లారు. ఆ ఫిర్యాదుపై సోమవారం జిల్లా మెట్రాలజీ అధికారి ప్రవీణ్‌కుమార్ వచ్చి బంక్‌ల రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా బంకులో పనిచేసే సిబ్బందితో మాట్లాడుతూ వాహనదారుల పట్ల మర్యాదపూర్వకంగా మలుచుకోవాలని, పెట్రోల్ కొలతల్లో హెచ్చుతగ్గులు లేకుండా చూసుకుని ప్రజలకు మంచి సర్వీస్ అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయి డిప్యూటీ తహశీల్దార్ ప్రసన్న, రెవెన్యూ సిబ్బంది, జిల్లా సేల్స్ ఆఫీసర్ ఇస్లావత్ సమ్మయ్య పాల్గొన్నారు.

# భవిష్యత్తు పోరాటాలకు పిలుపునిచ్చే ఉద్యమ సభ






ప్రజాపక్షం/ఇల్లందు: జనవరి 18న ఖమ్మంలో జరిగే సిపిఐ 100 సంవత్సరాల ఆవిర్భావ వేడుక భవిష్యత్తు పోరాటాలకు పిలుపునిచ్చే ఒక ఉద్యమ సభ అని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా అన్నారు. సోమవారం ఇల్లందుకు చేరుకున్న ప్రచార జాత యాత్రకు సిపిఐ శ్రేణులు ఇల్లందులోని 21 ఏరియా నుండి బైక్ ర్యాలీ లతో స్వాగతం పలికారు. అనంతరం ఇల్లందు పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద జరిగిన సభలో సాబీర్ పాషా మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఇంకా మనుగడ ఉందంటే అందుకు కమ్యూనిజమే పునాదిగా ఉంటుందన్నారు. జనవరి 18న జరిగే మహాసభకు 40దేశాల నుండి ప్రతినిధులు హాజరవుతున్నారని, దేశం నలుమూల నుండి 5లక్షల మందితో మహాసభను నిర్వహిస్తామన్నారు. ఇల్లందు ఉద్యమాలకు పురిటిగడ్డని, ఇక్కడి నుండే తెలంగాణ ఉద్యమానికి నాంది పలికిందన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలలో సిపిఐ పార్టీ ప్రజా సమస్యలపై పోరాటం చేసి మున్సిపాలిటీలో అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవాలన్నారు. కార్పొరేట్ల కోసమే ఉపాధి హామీ పథకంలో మార్పు తీసుకువచ్చారని, దీని వెనుక పెద్ద కుట్ర దాగుందన్నారు. 1940 నుండి సింగరేణికి ఎనిమిది దశాబ్దాలుగా భాతర కమ్యూనిస్టు పార్టీ ఏఐటీయూసీ నాయకత్వం వహించిందని అన్నారు. జీనా రెయితే మరణ సీకో అనే నినాదంతో స్వతంత్ర ఉద్యమంలో భగత్‌సింగ్‌కి స్ఫూర్తి నిచ్చిన జెండా కమ్యూనిస్టు జెండా అన్నారు. చాలా రాజకీయ పార్టీలు అధికారం ఉన్నప్పుడే ఉన్నాయి, అధికారం పోయాక అంతమైపోయాయని, కానీ ఎర్ర జెండా కమ్యూనిస్టు పార్టీలు అధికారం ఉన్నా లేకున్నా ఇప్పటికి ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ నిలుస్తుందని అన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కె సారయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరు వెంకటేశ్వర్లు, దేవరకొండ శంకర్, బంధం నాగయ్య, ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి రాము, ఏఐవైఎస్ జిల్లా కార్యదర్శి పాహిం, హరీష్, సిపిఐ పట్టణ మండల కార్యదర్శులు బాన శ్రీనివాసరావు, బొప్పిశెట్టి సత్యనారాయణ, సిపిఐ బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్, ఉపాధ్యక్షులు దాసరి రాజారాం, గుగుల్ కృష్ణ, మంచాల వెంకటేశ్వర్లు, కుమ్మరి రవీందర్, ఉడుత ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

# సాంబమూర్తి కుటుంబానికి పరామర్శ




ప్రజాపక్షం/ఇల్లందు: ఇటీవల కాలంలో చనిపోయిన ఇల్లందులోని స్టేషన్ బస్తీ శాఖ కార్యదర్శి కొత్తపల్లి సాంబమూర్తి కుటుంబాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా పరామర్శించారు. సిపిఐ అన్ని విధాలుగా సాంబమూర్తి కుటుంబానికి అండగా ఉంటుందని ఏ కష్టం వచ్చినా సిపిఐ పార్టీని కలవాలని సూచించారు. ఈకార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కె సారయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు దేవరకొండ శంకర్, బంధం నాగయ్య, పట్టణ కార్యదర్శి బాన శ్రీనివాసరావు, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

# అబ్బయ్య స్ఫూర్తి మాకు ఆదర్శం



ప్రజాపక్షం/అశ్వాపురం: మండల పరిధిలో గల మల్లెలమడుగు గ్రామంలో సోమవారం గ్రామ పంచాయితీ సర్పంచ్ మచ్చా నరసింహరావు, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు బారాజు సంపత్ ఆధ్వర్యంలో మాజీ తొలి దళిత సర్పంచ్ దానూరి అబ్బయ్య వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఓరుగంటి భిక్షమయ్య, గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్ బాబు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం పని చేసిన ఆయనను పార్టీ గుర్తించి చివరి దశలో ఆయనకు సర్పంచ్ పదవిని అప్పజెప్పిందని అలాంటి పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. పార్టీని నమ్ముకొని ఉన్నవారికి పార్టీ ఏనాడు మోసం చెయ్యదని తెలిపారు. స్థానిక సర్పంచ్ నరసింహారావు మాట్లాడుతూ ఆయన గ్రామానికి అయిన మొట్ట మొదటి దళిత సర్పంచ్ అని ఇప్పుడు నాకు అవకాశం వచ్చిందని ఆయన అడుగు జాడల్లో నడుస్తూ, ఆయన ఆశయ సాధనకు కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సబ్బా పిచ్చయ్య, కుంజ జాను, తూము పెద్ద రాఘవులు, ఆవుల రవి, రాగం మల్లయ్య, రేను సంజీవరెడ్డి, బచ్చు వెంకటరమణ, కొండ బత్తుల ఉపేందర్, దారపు శ్రీను, మనది సైదులు, చెంచాల రాము, సామకూరి వెంకన్న, పద్దం నరసింహారావు, బేతం బాబు, బొద్దు శ్రీనివాస్, వంగూరి మధు, బొద్దు ఉప్పలయ్య, బొజ్జ సంపత్, వారి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సిఎం కప్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి : కలెక్టర్



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : సిఎం కప్ క్రీడా పోటీలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఈ క్రీడా పోటీలపై అధికారులతో టెలికాన్ఫిరెన్స్ నిర్వహించి మాట్లాడారు. మారుమూల గ్రామాల్లో ఉన్న ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారికి అంతర్జాతీయ స్థాయి శిక్షణ అందించడమే సిఎం కప్ లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. ఈ క్రీడలు ఐదు దశల్లో జరుగుతాయని వెల్లడించారు. గ్రామపంచాయితీల స్థాయిలో ఈనెల 17 నుండి 22 వరకు మండలస్థాయి పోటీలు 28 నుండి 31 వరకు, నియోజకవర్గ పరిధిలోని వచ్చే నెల 3 నుండి 7 వరకు, జిల్లా స్థాయిలో ఫిబ్రవరి 10 నుండి 14 వరకు ఉంటాయని, గెలుపొందిన విజేతలు రాష్ట్ర స్థాయి సిఎం కప్ క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధిస్తారన్నారు. ఈ రాష్ట్ర స్థాయి పోటీలు ఫిబ్రవరి 19నుండి26 వరకు వివిధ ప్రాంతాల్లో జరుగనున్నాయన్నారు. గ్రామ స్థాయిలో క్రీడాపోటీల నిర్వహణకు జిల్లాను 77 క్లస్టర్లుగా విభజించామని, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడలు ఉంటాయని చెప్పారు. ఈ పోటీల నిర్వహణకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేసి క్రీడలు విజయవంతం అయ్యేందుకు అధికారులు పాటుపడాలని సూచించారు. నియోజకవర్గ స్థాయిలో అదనంగా ఫుట్‌బాల్ పోటీలు, జిల్లా స్థాయిలో మొత్తం 21 క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. క్రీడాకారులు తమ వివరాలను అధికారిక వెబ్ సైట్ ఎస్‌ఓటిజి.తెలంగాణ.గవ్.ఇన్// సిఎంకప్ లో నమోదు చేసుకోవాలని, మొబైల్ యాప్ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చని సూచించారు. పోటీల్లో పాల్గొన్న ప్రతీ క్రీడాకారునికి ధృవీకరణ పత్రం ప్రభుత్వం ద్వారా అందిస్తారని చెప్పారు. ఈ క్రీడలపై అన్ని స్థాయిల్లో అవగాహన కల్పించి, అవసరమైన మైదానాలను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# బ్యాంకులు సరైన భద్రత ఏర్పాటు చేసుకోవాలి

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : జిల్లాలో ఉన్న అన్ని బ్యాంకులు సరైన భద్రతను ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ రోహిత్ రాజ్ అన్నారు. సోమవారం తన ఛాంబర్లో బ్యాంకు అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏటిఎంలు, బ్యాంకుల్లో నేరాలు జరగకుండా అధికారులు జాగ్రత్త పడాలన్నారు. అన్ని ప్రదేశాల్లో సిసి కెమేరాలు ఏర్పాటు చేసుకోవాలని, బ్యాంకులలో ఉండే సెక్యూరిటీ అలారం ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఏటిఎంలలో నగదు లోడ్ చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, ప్రజలకు సైబర్ నేరాలపై ప్రతినిత్యం అవగాహన కల్పించాలని చెప్పారు. సైబర్ నేరాల బారిన పడి నగదు కోల్పోయిన బాధితులకు నేరగాళ్ల అకౌంట్లలోఫ్రీజ్ చేయబడిన నగదును త్వరితగతిన వారికి అందించేలా పోలీస్ శాఖతో సమన్వయం పాటిస్తూ చర్యలు తీసుకోవాలని చెప్పారు.

# గంజాయి పట్టివేత



ప్రజాపక్షం/పాల్వంచ : భద్రాచలం రహదారి నుండి పాల్వంచకు గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకొన్న సంఘటన సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే మండల పరిధి కేశవాపురం వద్ద ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ.శ్రీహరిరావు తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో భద్రాచలం రోడ్ నుండి పాల్వంచ వైపునకు వస్తున్న ఓ ముగ్గురు వ్యక్తుల అనుమానాస్పదంగా కనిపించారు. వారిని ఆపి తనిఖీ చేయగా వారి బ్యాగులో 7.50 కిలోల గంజాయి ఉన్నట్లు తెలిసింది. వెంటనే బైక్‌ను, మూడు సెల్ ఫోన్‌లను, సీజ్ చేసి అబ్కారీ స్టేషన్‌కు స్వాధీనం చేశారు.ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించారు. పాల్వంచకు చెందిన గొల్లపల్లి సాంబశివరావు, భూక్యా శ్రీహరి,పోతుల చిన్నలు కలిసి ఒడిస్సా రాష్ట్రం మల్కాన్‌గిరి నుండి నుండి పాల్వంచకు తరలిస్తున్నారని తెలిసింది. సులువుగా డబ్బు సంపాదించటానికి గంజాయిని విక్రయిస్తున్నట్లుగా తెలిపారు. నిందితులను పాల్వంచ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. కాగా గంజాయి విలువ సుమారు 3.50 లక్షల ఉంటుందని చెప్పారు. ఈ తనిఖీలలో హెడ్ కానిస్టేబుల్ కరీం, కానిస్టేబుల్స్ సుధీర్,వెంకట్, విజయ్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి కబడ్డీ పోటీలను జిల్లాలో నిర్వహించడం గర్వకారణం




## కబడ్డీ పోటీల ఏర్పాట్లను పరిశీలనలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

ప్రజాపక్షం/మణుగూరు: పినపాక మండలం ఏడుళ్ళ బయ్యారం గ్రామంలో ఈ నెల 7వ తేదీ నుండి ప్రారంభం కానున్న జాతీయ స్థాయి అండర్17 బాలుర కబడ్డీ పోటీలకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సోమవారం క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పినపాక జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్ ఆవరణలో కబడ్డీ పోటీల నిర్వహణ కోసం చేపడుతున్న ప్రాంగణ అభివృద్ధి పనులు, కబడ్డీ కోర్టుల నిర్మాణం, ప్రేక్షకుల గ్యాలరీలు, క్రీడాకారుల వసతి సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ సరఫరా, రవాణా సౌకర్యాలు, వైద్య సేవలు తదితర అంశాలను జిల్లా కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించి సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు, సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో కబడ్డీ వంటి ప్రముఖ క్రీడా పోటీలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్వహించడం జిల్లాకు గర్వకారణమని తెలిపారు. రాష్ట్ర స్థాయిలోనే కాకుండా దేశవ్యాప్తంగా జిల్లాకు మంచి గుర్తింపు తీసుకొచ్చే కార్యక్రమం కావడంతో ఎక్కడా చిన్న లోపం కూడా తలెత్తకుండా అత్యుత్తమ ప్రమాణాలతో పోటీలను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. క్రీడాకారులు, కోచ్‌లు, సాంకేతిక నిపుణులు, రిఫరీలు, అధికారులు, మీడియా ప్రతినిధులు మరియు క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశమున్నందున ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు.క్రీడాకారుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. వసతి గృహాల్లో పరిశుభ్రత, నాణ్యమైన భోజన ఏర్పాట్లు, స్వచ్ఛమైన తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలని తెలిపారు. పోటీ ప్రాంగణం, వసతి ప్రాంతాలు, ప్రధాన రహదారులపై తగినంత పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,"ఈ నెల 7వ తేదీ నుండి పినపాక మండలం ఏడుళ్ళ బయ్యారం గ్రామంలో జాతీయ స్థాయి అండర్17 బాలుర కబడ్డీ పోటీలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఈ పోటీలు జిల్లాలో జరగడం జిల్లావాసులందరికీ గర్వకారణం. రాష్ట్రంలో కబడ్డీపై ఆసక్తి, అభిమానం ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పోటీలకు హాజరై క్రీడాకారులను ప్రోత్సహించాలి. దేశంలోని పలు రాష్ట్రాల నుండి వచ్చే క్రీడాకారులు, అధికారులు భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయాన్ని దర్శించుకునే అవకాశం కూడా కలుగుతుంది. అలాగే గోదావరి తీర ప్రాంతాల సహజ సౌందర్యాన్ని ఆస్వాదించవచ్చు. పోటీల నిర్వహణకు సంబంధించి హైదరాబాద్‌కు చెందిన పలు ప్రముఖ సంస్థలు సి.ఎస్.ఆర్. ద్వారా విలువైన సహకారం అందిస్తున్నాయి. వారికి జిల్లా యంత్రాంగం తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. క్రీడాకారులందరూ ఉత్సాహంగా పాల్గొని ఉత్తమ ప్రతిభ ప్రదర్శించి తెలంగాణకు గోల్డ్ మెడల్ సాధించాలని ఆకాంక్షిస్తున్నాను అని అన్నారు.జాతీయ స్థాయి కబడ్డీ పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. పోటీలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి అధికారి తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆదేశించారు. ఈ పర్యటన లో కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి, సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు

# యూరియా అందుబాటులో ఉంది..

ప్రజాపక్షం/బూర్గంపాడు: బూర్గంపాడు మండలంలో యూరియా అందుబాటులో ఉందని రైతులు సద్వినియోగం చేసుకోగలరని మణుగూరు ఏడిఏ తాతారావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బూర్గంపాడు మండల పరిధిలోని బూర్గంపాడు సొసైటీ నందు 1120 యూరియా బస్తాలను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. గడిచిన రెండు నెలల కాలంలో 3869 యూరియా బస్తాలను సరఫరా చేశామన్నారు. దీనితో పాటు ప్రైవేటు షాపుల నందు 1028 బస్తాలు అందుబాటులో ఉన్నాయని, ఇప్పటి వరకు ప్రైవేటు షాపులో 2600 బస్తాలు గడచిన కాలంలో సరఫరా చేశామన్నారు. నేటికి మొత్తంగా బూర్గంపాడు నందు 2148 బస్తాలు అందుబాటులో ఉన్నాయని, మండలంలో కావల్సిన యూరియాను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. రైతులు ఎవరు యూరియా కొరత ఉన్నదని అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ శాఖ మండల అధికారి ఆర్ శంకర్, ఏఈఓ పవన్ కుమార్, సొసైటీ సిబ్బంది శ్రీకాంత్, మాజీ సొసైటీ డైరెక్టర్ బొల్లు రవి, తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ పోరాటాలు చిరస్మరణీయం



**-చరిత్రలో నిలిచిపోయేలా జనవరి18న బహిరంగ సభ**
**-చింతకాని నుంచి వేలాదిగా తరలి రావాలి**
**-సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల**

**ప్రజాపక్షం/చింతకాని :** ప్రజాపక్షాన సిపిఐ చేసిన పోరాటాలు త్యాగాలు చిరస్మరణయమని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి పేర్కొన్నారు.సిపిఐ శతవసంతాల ముగింపు సభ జయప్రదం చేయాలని కోరుతూ చేపట్టిన ప్రచార జాతా సోమవారం చింతకాని మండలం చేరుకుంది. నాగులవంచ నుంచి ప్రారంభమైన జాతా పాతర్లపాడు, ప్రొద్దుటూరు, నాగిలిగొండ, కోమట్లగూడెం, నేరడ, కొదుమూరు, బస్వాపురం గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా జరిగిన సభల్లో జితేందర్ రెడ్డి మాట్లాడుతూ కమ్యునిజం అజేయమని..మరో వందేళ్ల ప్రజల హృదయంలో కమ్యునిజం నిలిచి ఉంటుందన్నారు. సిపిఐ ఆవిర్భావం నుంచి అనేక నిర్భందాలను ఎదుర్కొని ప్రజల పక్షాన నిలిచిందన్నారు. సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యలతో పాటు రైతులు , యువజనులు మహిళ , విద్యార్థి, వ్యవసాయ కార్మిక సమస్యలపై చారిత్రక పోరాటాలు చేసి అపూర్వ విజయాలను సాధించిందన్నారు. భారత కమ్యునిస్టు పార్టీ చరిత్రలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం సువర్ణాక్షర లిఖితమని ఈ పోరాటంలో నాలుగున్నర వేల మంది అమరులయ్యారని సాయుధ పోరాటం తెలంగాణ సమాజం పై తీవ్ర ప్రభావం చూపిందని, ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చి జనజీవితంలో గొప్ప మార్పు తెచ్చిందన్నారు. వందేళ్ల సుధీర్ఘ పోరాటాన్ని నేటి తరానికి తెలియజేయడంతో పాటు భవిష్యత్తు పోరాటాలకు ప్రజలను సిద్ధం చేసేందుకు 2026 జనవరి 18న ఖమ్మంలో చారిత్రక సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జనవరి 18న సాయంత్రం నాలుగు గంటలకు డిగ్రీ కళాశాల మైదానంలో లక్షలాదిమందితో బహిరంగ నిర్వహిస్తున్నామని ఈ సభకు తెలంగాణ రాష్ట్రంతో పాటు దక్షిణాది రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలిరానున్నారు. ఈ సభను జయప్రదం చేసేందుకు చింతకాని మండల వ్యాప్తంగా పలు రకాలుగా ప్రచారం నిర్వహించి పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చేలా కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. ప్రతి గ్రామం నుంచి అన్ని వర్గాల ప్రజలు తరలి వచ్చేలా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు సింగు నర్సింహారావు , సీహెచ్ సీతామహలక్ష్మీ , ఏపూరి రవీంద్రబాబు, పావులూరి మల్లిఖార్జునరావు, కూచిపుడి రవి, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, సహాయ కార్యదర్శులు అబ్బూరి మహేష్, మార్గం శ్రీను, జిల్లా కౌన్సిల్ సభ్యులు రాసాల మోహన్‌రావు, చిన్నమండవ, నాగిలిగొండ, నేరడ, బస్వాపురం సర్పంచ్‌లు పర్చా రామచంద్రరావు, ఏపూరి పద్మ, దూసరి నేతాజీ, ఆవుల నర్సింహారావు, నాయకులు తాళ్ళూరి యాదగిరి, సింగారపు సత్యనారాయణ, కొళ్లి రవి, నారపోగు హేమ నాగార్జున, తుపాకుల లక్ష్మీ నారాయణ, పదిమల వెంకటనర్సయ్య, కొళ్లి గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

## బొగ్గు ఉత్పత్తిలో యంత్రాలు అదనపు శక్తిగా ఉపయోగపడుతాయి..



**జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్**

**ప్రజాపక్షం/మణుగూరు:** బొగ్గు ఉత్పత్తిలో యంత్రాలు అదనపు శక్తిగా ఉపయోగపడుతాయని జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ అన్నారు. సోమవారం మణుగూరు ఏరియా పికెఓసి బేస్ వర్క్ షాప్ నందు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామ్‌చందర్ చేతుల మీదుగా 2 భారీ యంత్రాల ప్రారంభోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించబడినది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పారిశ్రామిక ప్రగతి అంతగా లేని కాలంలో బొగ్గు ఉత్పత్తి కేవలం కార్మికుల శ్రమ శక్తి మీద ఆధారపడి జరిగేది అన్నారు. ప్రస్తుత కాలంలో బొగ్గు ఆధారిత పరిశ్రమలు విద్యుత్ ఉత్పాదక కేంద్రాలు పెరిగాయి కాబట్టి వాటి అవసరాలు తీర్చేలా డిమాండ్ కు తగ్గ బొగ్గు ఉత్పత్తి జరుగాలంటే కేవలం శ్రామికుల కృషి సరిపోదు కాబట్టి సింగరేణి యాజమాన్యం డిమాండ్ కు తగ్గ బొగ్గు ఉత్పత్తి చేసేందుకు తక్కువ కాలంలో తక్కువ సంఖ్యలో కార్మికులతో ఎక్కువ ఉత్పత్తి చేసేందుకు గాను శ్రమ శక్తికి యాంత్రిక శక్తికి జోడించి బొగ్గు ఉత్పత్తిలో అద్భుత ఫలితాలు సాధించడం జరుగుతుంది అన్నారు. అదే క్రమంలో పికెఓసి అవసరాలు తీర్చేందుకు గాను భారత్ యెర్త్ మువేర్స్ లిమిటెడ్ (బిఈఎంఎల్) కు రూ. 5,95,57,142.96 (ఐదు కోట్ల తొంబై ఐదు లక్షల యాభై ఏడు వేల నూట నలభై రెండు రూపాయిల తొంబై ఆరు పైసలు) వెచ్చించి 2 మోటార్ గ్రేడర్లను కొనుగోలు చెయ్యడం జరిగింది అన్నారు. రహదారుల మరమ్మతుకు మోటార్ గ్రేడర్ ఎంతగానో ఉపయోగపడుతూ బొగ్గు ఉత్పత్తికి పరోక్షంగా సహాయ పడుతాయి అన్నారు. కాబట్టి వీటిని నిబంధనలకు అనుగుణంగా జాగ్రత్తగా నడుపుకుంటు సకాలంలో మెంటెన్ చేయడం ద్వారా వీటి జీవిత కాలాన్ని పెంచాలని సూచించారు. ఈ సంవత్సరం మణుగూరు ఏరియాలో అధిక వర్షపాతమున్న నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించుటకు కొంత వెనుకబడినామని, రానున్న 3 మాసాల కాలంలో మణుగూరు ఏరియాకు నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించుటకు సమిష్టిగా పనిచేసి యంత్రాల పని గంటలను పూర్తి స్థాయిలో వినియోగించుకొని ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జిఎం బి. శ్రీనివాసాచారి, పిఓ పికెఓసి ఎం. రమేష్, ఎస్ఈ డి. వెంకట రామారావు, ఏజిఎం (ఐఈడి) సిహెచ్. రాంబాబు, డిజిఎం (పర్సనల్) ఎస్. రమేష్, ఇంచార్జ్ ఏరియా ఇంజినీర్ వీరభద్రుడు, డిజిఎం (ఫైనాన్స్) ఎం. అనురాధా, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ వై. రాంగోపాల్, ప్రాతినిధ్య సంఘం నాయకులు ఎస్కే అబ్దుల్ రవూఫ్, డిజిఎం (ఓసి స్టోర్స్) రామకృష్ణ , ప్రాజెక్ట్ మేనేజర్ సారధి సుమన్ , ఓసి2 మేనేజర్ సురేష్, ఏరియా సెక్యూరిటీ అధికారి కే. శ్రీనివాస్, ఇతర ఉన్నత అధికారులు, అధికారులు, సంక్షేమ అధికారి వంశీ కృష్ణ, బీఈఎంఎల్ అధికారులు, బేస్ వర్క్ షాప్ ఆపరేటర్లు, టెక్నీషియన్లు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ శత వసంతాల ముగింపు సభను జయప్రదం చేయండి

**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి భాను ప్రసాద్**

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఖమ్మం పట్టణ కేంద్రంలో జనవరి 18న 5లక్షల మందితో నిర్వహించబోయే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి భానుప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం నేలకొండపల్లి మండల కేంద్రం లోని కర్నాటి కృష్ణయ్య భవనం లో మండల కౌన్సిల్ సభ్యులు అనంతపుల్లయ్య అధ్యక్షతన సిపిఐ మండల కౌన్సిల్, ముఖ్య నాయకుల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి భాను ప్రసాద్ మాట్లాడారు. సిపిఐ 100 ఏళ్ల చరిత్రలో ఎన్నో ప్రజా పోరాటాలు నిర్వహించి ప్రజా సంఘాలను ఏర్పాటు చేసి ప్రజా ఉద్యమాలను నిర్వహించిన ఘనత సిపిఐ ది అని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో 10 లక్షల ఎకరాల భూములను పంచి 3500 గ్రామాలను విముక్తి చేసిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీ ది అని తెలిపారు. జనవరి 18న జరగబోయే బహిరంగ సభ పార్టీ భవిష్యత్తుకు పునాది లాంటిదని అన్నారు. చరిత్రలో నిలిచిపోయే విధంగా బహిరంగ సభ జరగబోతుందని తెలిపారు. ప్రతి గ్రామం నుంచి వందలాదిగా తరలివచ్చే విధంగా ప్రయత్నాలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కనకబండి సీతారాములు, సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు, మండల సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్, మండల కౌన్సిల్ సభ్యులు కర్నాటి నళిని రాణి, తమ్మిశెట్టి మమత, బాలిన కృష్ణంరాజు, ఆలేటి ఉమామహేష్, ఎస్.కె సత్తార్, కాశబోయిన అయోధ్య, పోలంపల్లి నారాయణ,రావెల కృష్ణ, భద్రాద్రి వెంకటేశ్వరరావు, యలగాల వెంకటేశ్వర్లు, ముత్యాల వెంకటేశ్వర్లు, మేకల పుల్లయ్య, కుంచం బిక్షం, చిలువేరు రేణుబాబు, వాసంశెట్టి వెంకటేశ్వర్లు, చెన్నబోయిన మల్లయ్య, బానోతు బాలాజీ, మూడు శీను పాల్గొన్నారు.



## యూరియాపై రైతులు ఆందోళన చెందవద్దు



**ప్రజాపక్షం/చింతకాని :** జిల్లాలో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని అదనపు కలెక్టర్ పి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం చింతకాని మండలం నాగిలిగొండ లో ఏర్పాటు చేసిన యూరియా పంపిణీ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 185 యూరియా పంపిణీ కేంద్రాల ద్వారా రైతులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పంపిణీ కేంద్రాల వద్ద రైతులకు అన్ని మౌళిక సదుపాయాలు కల్పించామన్నారు, పంపిణీ కేంద్రాలకు వచ్చిన రైతులకు టోకెన్లు అందజేసి యూరియా పంపిణీ చేస్తున్నట్లు , రైతులకు పంపిణీ కి అవసరమైన యూరియా జిల్లాలో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, సహకార సంఘం అధికారులు పాల్గొన్నారు.

## ఓటు అడిగే హక్కు బిఆర్ఎస్‌కే ఉంది..



**ప్రజాపక్షం/ఇల్లందు:** ఓటు అడిగే హక్కు కేవలం బిఆర్ఎస్‌కే ఉందని బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎంఎల్ఎ హరిప్రియ నాయక్ అన్నారు. సోమవారం మున్సిపాలిటీలోని 8,13, 15 వార్డుల్లో వార్డు బాట కార్యక్రమాన్ని బిఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యులు దిండిగల రాజేంద్రతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఇల్లందు నియోజకవర్గ ఎంఎల్ఏగా తాను అనేక రంగాల్లో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ప్రజల చిరకాల కోరిక అయిన బస్ డిపోను మంజూరు చేయించడం, డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేయడం, నాటి మంత్రి తన్నీరు హరీష్‌రావుతో చర్చించి ఇల్లందు ప్రభుత్వ వైద్యశాలను వైద్య విధాన పరిషత్‌లోకి తీసుకొచ్చి సకల సౌకర్యాలు, సదుపాయాలు సమకూర్చడం, గర్భిణీ స్త్రీలకు టిఫాస్కానింగ్, సిజేరియన్ ఆపరేషన్లు, 100 పడకల ఆసుపత్రిగా మంజూరు చేయించుకోవడం, ప్రతి సంక్షేమ పథకాలను గడప గడపకు చేరవేయడం, బుగ్గ వాగు ప్రక్షాళన, జీవో నెంబర్ 76 రిజిస్ట్రేషన్ పట్టాలు, వృద్ధులకు వృధాప్య పెన్షన్ తదితర అవన్నీ విజయవంతంగా కొనసాగాయని అన్నారు. చైతన్యవంతమైన ఓటర్లు రానున్న మున్సిపల్ ఎన్నికల్లో అభివృద్ధి చేసిన పార్టీ బిఆర్ఎస్ అభ్యర్థులకే ఓటు వేయాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు అబ్దుల్ జబ్బర్, సిలివేరి సత్యనారాయణ, పరుచూరి వెంకటేశ్వర్లు, కడకంచి పద్మ, చీమల సుజాత, రాజశేఖర్, వీరస్వామి, రమేష్, ఇమ్రాన్, గిన్నారపు రాజేష్, చాంద్ పాషా, మీర్జా బేగ్, నిఖిల్, రవికాంత్, సత్యనారాయణ, నారాయణమ్మ, రెహానా, సల్మా, తదితరులు పాల్గొన్నారు.

## భట్టిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు



**ప్రజాపక్షం/ బోనకల్ :** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కపై సిపిఎం పార్టీ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఐదు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తీవ్రంగా ఖండించారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు గాలి దుర్గారావు అధ్యక్షతన సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, చింతకాని మండల అధ్యక్షులు అంబటి వెంకటేశ్వరరావు, ముదిగొండ మండల అధ్యక్షులు కొమ్మినేని రమేష్‌బాబు, ఎర్రుపాలెం మండల అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ సిపిఎం ముఠా రాజకీయాలు నచ్చకనే దూరం పెట్టిన ప్రజలు సామినేని హత్యలో సూత్రదారులు, పాత్రదారులు ఎంతో కాలం దాక్కోలేరన్నారు. ఇప్పటికైనా సిపిఎం హత్య రాజకీయాలను మానుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో పిసిసి సభ్యులు పైడిపల్లి కిషోర్‌కుమార్, చింతకాని మండల కిసాన్ సెల్ అధ్యక్షులు కొప్పుల గోవిందరావు, మధిర మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుడేటి బాబురావు, ఎర్రుపాలెం మండల కిసాన్ సెల్ అధ్యక్షులు తల్లపురెడ్డి నాగిరెడ్డి, కృష్ణాపురం మాజీ సర్పంచ్ కర్నాటి రామారావు, తూటికుంట్ల సర్పంచ్ తుళ్లూరి లక్ష్మీ నరసయ్య, రావినూతల సర్పంచ్ భూక్యా భద్రు, మాజీ కో ఆప్షన్ సభ్యులు జమాలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ మానవాళికి సవాల్‌గా మారిన వాతావరణ కాలుష్యం



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** ప్రస్తుతం ప్రపంచ మానవాళి ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య వాతావరణ కాలుష్యమని వాతావరణ కాలుష్యం ద్వారా ప్రపంచ మానవాళి పెను ప్రమాదం ఎదుర్కోబోతున్నారని, దీనిని అరికట్టాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా చొరవ తీసుకుని ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించుకోవడానికి ప్రతిఒక్కరూ కంకణబద్ధులై ప్లాస్టిక్‌ని వాడకుండా నివారించాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్యామలాదేవి అన్నారు. ఖమ్మం మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినిలతో తిరుమలాయపాలెం గ్రామంలో వారంరోజులు పాటు ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరాన్ని ఏర్పాటు చేసి గ్రామంలో పరిశుభ్రత ఆరోగ్య భద్రతపై ప్రజలకు విద్యార్థినిలు అవగాహన కల్పిస్తున్నారని ఆమె తెలిపారు. నాలుగోరోజు వైద్య విధాన పరిషత్‌లో ఆవరణంలో ఉన్న మొక్క పిచ్చి మొక్కలను శ్రమదానం చేసి తొలగించి శుభ్రపరిచారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుజాత, ఉపసర్పంచ్ శ్రీనివాస్, ఆయూష్ డాక్టర్ కనకలక్ష్మి , పంచాయతీ కార్యదర్శి సుజాత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రామకుమారస్వామి, పాఠశాల హెచ్ఎం విజయకుమారి, పాఠశాల సోషల్ స్కూల్ అసిస్టెంట్ శ్రీదేవి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.